## 10శాతం ముస్లిం రిజర్వేషన్లను అంగీకరించం

హైదరాబాద్,కేవలం బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే భాజపా పూర్తి మద్దతిస్తుందని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఇందులో ముస్లిం రిజర్వేషన్లను అంగీకరించబోమని అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దిల్లీలో కాంగ్రెస్ ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో చేసినట్లే దిల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు ముస్లింలకు 10శాతం ఇస్తామని చెప్పలేదు. బీసీలకే 42 శాతం అమలు చేస్తామంటే పూర్తి మద్దతిస్తాం. ముస్లింలకు 10 శాతం ఇస్తే.. 10 శాతం బీసీలకు అన్యాయం జరుగుతుంది. రిజర్వేషన్లను భాజపా అడ్డుకుంటోందని ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్‌ను బీసీలు నమ్మరని అన్నారు. బిసిల పేరు చెప్పి ముస్లింలకు ఇచ్చే కుట్రలను అడ్డుకుంటామని అన్నా రు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ఉద్దేశం లేదని రామచందర్‌రావు అన్నారు. ముస్లింలకు 10 శాతం ఇస్తే, పదిశాతం బిసిలకు అన్యాయం జరుగుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :140 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: బుధవారం 06-08-2025 పేజీలు:4 వెల: 2.00


## ఆపరేషన్ సింధూర్‌పై ప్రతిపక్షాల తీరు బాధించింది



న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరు ఎంతగానో బాధించిందని ప్రధాని మోడీ అన్నారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం అయింది. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో ప్రధాని మోడీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోడీ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాల వైఖరి ఏ మాత్రం బాగోలేదన్నారు. తమకు తాము గాయం చేసుకునే విధంగా విపక్ష తీరు ఉందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఎన్ని కీలక విజయాలు సాధించిందని గుర్తుచేశారు. ఆర్టికల్ 370 రద్దు, రామమందిర స్థాపనను జ్ఞాపకం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా ప్రతిపక్షం స్వీయ హాని కోసం పట్టుబట్టిందని వాపోయారు. ఈ చర్చ ద్వారా ప్రతిపక్షం తప్పు చేసిందన్నారు. ఇక ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆపరేషన్ సిందూర్‌పై తీర్మానాన్ని చదివి వినిపించగా.. కూటమి నేతలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది చనిపోయారు. దీనికి ప్రతీకారంగా మే 7న పాకిస్థాన్‌పై భారతప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా దెబ్బతిన్నాయి. ఇక ఇరు దేశాల చర్చల తర్వాత కాల్పుల విరమణ జరిగింది. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ మెజారిటీని కోల్పోయింది. మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వం నడుస్తోంది. మిత్రపక్షాలు టీడీపీ, జేడీయూ, ఎల్జీపీ సహకారంతో ప్రభుత్వం నడుస్తోంది. గతేడాది జూన్‌లో ఎన్డీఏ సమావేశం జరగగా.. ఇన్నాళ్లకు రెండోసారి ఎన్డీఏ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## అసెంబ్లీలో 655 పేజీల రిపోర్టు పెట్టండి.. చీల్చి చెండాడుతాం : హరీశ్‌రావు

హైదరాబాద్ : కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై మాజీ నీటి పారుదల శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. 60 పేజీలతో కూడిన రిపోర్టు కాకుండా అసెంబ్లీలో 655 పేజీల రిపోర్టు పెట్టండి.. చీల్చి చెండాడుతామని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నిన్న రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్ పేరు మీద కొన్ని లీకుల రూపంలో రిపోర్టు మొత్తం బయట పెట్టకుండా వండి వార్చిన ఒక నివేదికను బయటపెట్టారు. దాని మీద వాస్తవాలు ప్రజల ముందు ఉంచాలని ఈ ప్రెస్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించడం జరుగుతుంది. గత 20 నెలలుగా రాష్ట్రంలో చూస్తే రేవంత్ రెడ్డి పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. రైతులకు సరిపడా యూరియా లేదు. హాస్టల్ పిల్లలకు సరైన ఆహారం లేక ఆస్పత్రి పాలవుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం, ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం విద్యార్థులు, నిరుద్యోగులు రోడ్డెక్కుతున్న పరిస్థితి. ఈరకమైన పరిస్థితులు ఉన్నాయి. డబ్బులు దంచుకునేందుకు కమీషన్లు, ప్రతిపక్షాల మీద కక్ష సాధించేందుకు రాజకీయ కమీషన్లకు రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. ల్యాండ్ కన్‌వర్షన్, బిల్డింగులకు అనుమతల కోసం కమీషన్లు. రాష్ట్రమంతా కమీషన్ల మాయంగా మారిందని హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి కుట్ర చేస్తున్నారు. రాజకీయంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఎన్డీఎస్ఏ రిపోర్టు మీ అందరికీ తెలుసు. ఇదే గోదావరి మీద పోలవరం ప్రాజెక్టు ఉంది. అది మూడుసార్లు కుప్పకూలింది అయినా ఎన్డీఎస్ఏ పోదు, రిపోర్టు ఇవ్వదు. కానీ మేడిగడ్డ మీద మాత్రం పిలవక ముందే, రాష్ట్ర ప్రభుత్వం కోరకుండానే ఎన్డీఎస్ఏ వస్తది.. రిపోర్టు ఇస్తది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఒక రిపోర్టు, ఎంపీ ఎన్నికల ముందు ఒక రిపోర్టు, బీఆర్ఎస్ రజతోత్సవం ముందు ఒక రిపోర్టు ఇస్తారు బీజేపోళ్లు. ఇది బీజేపీ నీతి అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇక రేపోమాపో లోకల్ బాడీ ఎన్నికలు వస్తున్నాయి.. ఇప్పుడు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం మీద కాళేశ్వరం కమిషన్ రిపోర్టు బయటపెట్టి రాజకీయ కుట్రలకు పాల్పడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం. దుర్మార్గంగా వ్యవహరిస్తుంది. కేసీఆర్, హరీశ్‌రావును పిలవాల్సిన అవసరం లేదని, కాళేశ్వరం



కమిషన్ రిపోర్టు ఇచ్చినట్లు మీరే రాశారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ రాత్రికి రాత్రే కమిషన్ గడువు పెంచారు. కేసీఆర్, హరీశ్‌రావును పిలిచినట్టు మీడియాలో లీకులు. కానీ మాకు నోటీసులు రాలేదు. ఇదంత కుట్ర అని అర్థమైందని హరీశ్‌రావు అన్నారు. నిన్న రాష్ట్ర ప్రభుత్వం 60 పేజీలతో ఒక రిపోర్టును విడుదల చేశారు. ఆ రిపోర్టు చూస్తుంటే అవాస్తవాలు, అబద్దాలు, రాజకీయ దురుద్దేశాలతో కూడిన రిపోర్టు అది. అది పూర్తి రిపోర్టా..? కమీషన్లో ఉన్న విషయాలే చెప్పారా..? ప్రభుత్వం ఏమైనా వండి వార్చిందా..? పూర్తి రిపోర్టు బయటకు వస్తే డెఫినెట్‌గా బీఆర్ఎస్ గట్టిగా స్పందిస్తుంది. అసెంబ్లీలో పెడుతామంటున్నారు. అసెంబ్లీలో 655 పేజీల రిపోర్టు పెటండి.. చీల్చి చెండాడుతాం. నిజాలు ప్రజల ముందు పెడుతాం. వాస్తవాలను నిగ్గు లేత్చుతాం. శాసనసపభా వేదికగా ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. నచ్చిన పేరాలు లీకులు.. నచ్చని నాయకులను బాధ్యులను చేసినట్టు నిన్న ప్రభుత్వం రిలీజ్ చేసిన రిపోర్టు కనబడుతుంది. అదే నిజమైతే కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుబట్టినట్టు రిపోర్టు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు టీఏసీ టెక్నికల్ అనుమతులు ఇచ్చింది. సెంట్రల్ వాటర్ కమిషన్, ఇంజినీర్లను తప్పుబట్టినట్టు. ఒక వైపూ చూసి ఒక వైపు నిలబడి ఇచ్చినట్టు రిపోర్టు ఉంది. 655 పేజీల రిపోర్టు బయటపెడితే వాస్తవం తెలుస్తుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష హెచ్చరికలు..

హైదరాబాద్,బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నిన్న (సోమవారం) హైదరాబాద్ నగరంలో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ రోజు కూడా హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసిన వాతావరణ శాఖ రాష్ట్రం మొత్తానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ద్రోణి ప్రభావం మరింత పెరిగితే ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేసే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల పాటు గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయడంతో పాటు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, వరంగల్,



మహబూబాబాద్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## రాష్ట్ర బిజెపి అధ్యక్షుడి సమక్షంలోనే తన్నుకున్న కమలం శ్రేణులు



పెద్దపల్లి,ఆగస్టు 5 : పెద్దపల్లి బిజెపిలో వర్గపోరు మరోసారి భగ్గుమంది. సాక్షాత్తు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే కమలం శ్రేణులు చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పెద్దపల్లిలో జరుగు ముఖ్య కార్యకర్త సమావేశానికి వస్తున్న సందర్భంగా మంగళవారం బిజెపి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరైన పెద్దపల్లి కమాన్ వద్ద గజమాలతో స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్సెస్ దుగ్యాల ప్రదీప్ కుమార్ రెండు వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రచార వాహనం దిగిపోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పరస్పరం దాడులు చేసుకున్నారు. పెద్దపల్లి జిల్లా బిజెపి పార్టీలో కొద్దిరోజులుగా వర్గ పోరు సాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మరో రెండు వర్గాల మధ్య వర్గ పోరు జరిగి నాయకులు, కార్యకర్తలు తన్నుకున్నారు. అక్కడే ఉన్న సీఐ ప్రవీణ్ కుమార్ కార్యకర్తలను వారించి రెండు వర్గాలను శాంతింపజేశారు. బిజెపి తన్నులాట పెద్దపల్లి జిల్లా కేంద్రం సంచలనం సృష్టించింది. రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే గ్రూప్ తగాదాలు తలెత్తడంతో కొంత అవమానానికి గురైనట్లు తెలుస్తోంది. స్వాగతం తెలిపే కొంత మంది ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున మనస్పర్థలు తన్నుకునే స్థాయికి చేరడం శ్రేణుల్లో నిరాశను నింపింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, పాల్గొన్నారు.

## సభలో సీఐఎస్ఎఫ్ సిబ్బందిని వినియోగిస్తున్నారు..




న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో కేంద్ర బలగాలను వినియోగిస్తున్నట్లు రాజ్యసభ ఎంపీ మల్లిఖార్జున్ ఖర్గే ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇవాళ రాజ్యసభలో గందరగోళం నెలకొన్నది. విపక్షాలు చేపట్టిన నిరసనను డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ తప్పుపట్టారు. మల్లిఖార్జున్ రాసిన లేఖను మీడియాకు రిలీజ్ చేయడం లేదని హరివంశ్ తెలిపారు. సభలో విపక్ష సభ్యులు చేస్తున్న నిరసనను డిప్యూటీ చైర్మెన్ ఖండించారు. మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. సభలో సాయుధ బలగాలను మోహరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ సమయంలో సభాపతి, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సీఐఎస్ఎఫ్ సిబ్బంది.. వెల్‌లోకి దూసుకువస్తున్నారని, ఇది ఆశ్చర్యకరంగా, షాకింగ్‌గా ఉన్నట్లు ఖర్గే ఆరోపించారు. సభ్యులు తమ ప్రజాస్వామ్య బద్ధమైన హక్కుల అంశంలో నిరసన చేపడుతున్నప్పుడు సీఐఎస్ఎఫ్ దళాలు ఎలా వచ్చాయని ఖర్గే ప్రశ్నించారు. నిన్న ఇదే జరిగింది, ఇవాళ ఇదే జరిగిందన్నారు. మన పార్లమెంట్ అంత దిగజారిపోయిందా అని అడిగారు. భవిష్యత్తులో సీఐఎస్ఎఫ్ దళాలు.. హౌజ్ వెల్‌లోకి దూసుకువస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. హౌజ్ వెల్‌లోకి కేవలం మార్షల్స్‌ను మాత్రమే అనుమతిస్తారని కేంద్ర మంత్రి రిజిజు తెలిపారు. ఖర్గే సభను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది హౌజ్‌లో ఉన్నట్లు ఖర్గే చేసిన ఆరోపణలను ప్రభుత్వం ఖండించింది. సభను చైర్మెన్ నడిపిస్తున్నారా లేక మంత్రి అమిత్ షా నడిపిస్తున్నారా అని ఖర్గే ప్రశ్నించారు. విపక్ష సభ్యుల అరుపుల నడుమ రాజ్యసభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. మరో వైపు కేంద్ర సర్కారు.. సీఐఎస్ఎఫ్ సిబ్బంది సంఖ్యను పెంచనున్నది. సీఐఎస్ఎఫ్ బలగాల సంఖ్యను 2,20,000కు పెంచనున్నారు. దీని కోసం కేంద్ర హెూంశాఖ ఆమోదం కూడా తెలిపింది. 2029 నాటికి మరో 70 వేల మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందిని రిక్రూట్ చేయనున్నారు.

### దారుణం.. తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారయత్నం

వికారాబాద్ జిల్లా: చన్గోముల్ పోలీసు స్టేషన్ పరిధిలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి, బాలికపై అత్యంత క్రూరంగా అత్యాచారయత్నం చేశాడు. వివరాల్లోకి వెళితే, బాధిత బాలిక తల్లిదండ్రులు చన్గోముల్ నేవీ రాడార్ స్టేషన్‌లో పని చేస్తున్నారు. అదే ప్రాంగణంలో నిందితుడు కూడా లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో నిందితుడు బాలికను ఏకాంతంలో చూసి, ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు గమనించిన స్థానికులు వెంటనే స్పందించి నిందితుడిని పట్టుకున్నారు.

## కాళేశ్వరం నివేదిక లీకులను పట్టించుకోం

హైదరాబాద్,తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై విచారణ కమిషన్ నివేదిక హాట్ టాపిక్‌గా మారింది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతున్న వేళ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ఈ అంశంపై స్పందించారు. నివేదిక లీకులపై తమకు ఎలాంటి ఆసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. "ప్రభుత్వం కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాతే మేము స్పందిస్తాం. ఇప్పుడే బయటకు వస్తున్న ఈ నివేదిక ప్రభుత్వానిదా? లేక కాంగ్రెస్‌దా?" అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మొదటి నుంచే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని చెబుతోందని రాంచందర్ రావు గుర్తు చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరగాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో నిజమైన చిత్తశుద్ధి చూపడం లేదని ఆయన విమర్శించారు. ముఖ్యంగా బీసీ జాబితాలో ముస్లింలను కలపకూడదని, ఇది బీసీలకు అన్యాయం అవుతుందని ఆయన పెద్దపల్లిలో స్పష్టం చేశారు. ప్రస్తుతం మీడియాలో చక్కర్లు కొడుతున్న నివేదిక లీకులపై బీజేపీ ఎలాంటి వ్యాఖ్యలు చేయబోదని రాంచందర్



రావు తెలిపారు. "ప్రభుత్వం అసెంబ్లీలో పూర్తి నివేదికను ప్రవేశపెట్టిన తర్వాతే మా అభిప్రాయాన్ని వెల్లడిస్తాం," అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం నివేదికను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆయన ఆరోపించారు. "ప్రజలకు వాస్తవాలు తెలిసేలా పూర్తి వివరాలతో నివేదికను అసెంబ్లీలో ఉంచాలి," అని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ ఫ్యామిలీపై గువ్వల బాలరాజు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,అవినీతి ఆరోపణలు, వరుస విచారణలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సోమవారం పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన ఫ్యాక్స్ ద్వారా తన రాజీనామా పత్రాన్ని పార్టీ అధినేత కేసీఆర్‌కు పంపించారు. మంగళవారం ఆయన మరోసారి ఈ రాజీనామాపై స్పందించారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీకి రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు. ఈనెల 2న తన రాజీనామా సమర్పించానని, కాళేశ్వరం నివేదిక వెలువడిన తర్వాత రాజీనామా చేశానని చెప్పడం సరైందికాదని వ్యాఖ్యానించారు. తన లేఖలో ఎక్కడా అసంతృప్తిని వ్యక్తం చేయలేదని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీ కొంత బాధలో ఉంది.. నేనూ బాధ పెట్టదల్చుకోలేదన్నారు గువ్వల బాలరాజు. మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నట్లు బాలరాజు వెల్లడించారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో తాను సూత్రధారి కాదని, కేవలం పాత్రధారినేనని స్పష్టం చేశారు. కేసీఆర్ సూచన మేరకే ఆ ఘటనకు తాను వెళ్లినట్లు తెలిపారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం గురించి తాను ఎప్పుడూ



మాట్లాడలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లోకి రావాలని పెద్ద పెద్ద నేతలు అడుగుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి కూడా మా నియోజకవర్గానికి చెందినవారే అని ఆయన అన్నారు. ఇంకా ఏ పార్టీలో చేరాలన్నది నిర్ణయించలేదని, తన అనుచరులు, జిల్లా ప్రజల అభిప్రాయాల ప్రకారం త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తానని తెలిపారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం దీక్ష చేపట్టండి



హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావులకు చిత్తశుద్ధి ఉంటే 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం దీక్ష చేయాలని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) డిమాండ్ చేశారు. ఈ విషయమై అన్ని పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. రిజర్వేషన్లకు అడ్డు ఎవరూ లేరని, కాని ఈ మూడు పార్టీలు నయా నాటకానికి తెరతీస్తున్నాయన్నారు. తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్.. 42 శాతం రిజర్వేషన్ పేరుతో అసెంబ్లీ, మండలిలో బిల్లు పెట్టి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపిందని, మళ్లీ ఆర్డినెన్స్ అంటున్నారని విమర్శించారు. విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ అంశమే లేదని, కేవలం స్థానిక సంస్థల ఎన్నికల అంశమే ఉందన్నారు.

నిరుద్యోగుల నిలదీత

సమావేశం ముగిసే సమయంలో పలువురు నిరుద్యోగులు, డీఎస్సీ-2024 స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు తమ సమస్యల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఎమ్మెల్సీని ప్రశ్నించారు.

## సంపాదకీయం

**బుధవారం 06-08-2025**

# చట్టాలు కాలరాచి.. నీతివాక్యాలు మాట్లాడడమా ?

బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ మారడంపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పెద్దగా సంచలనం కలిగించ లేదు. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీం ధర్మాసనం తీర్పు ఇచ్చినా పెద్దగా చర్చ సాగలేదు. ఎమ్మెల్యేలపై అనర్హతవేటు పడుతుందని బిఆర్ఎస్ ఆశపడింది. కానీ అలా జరగలేదు. అయితే ఈ విషయంలో ఎవరికి వారు తీర్పుపై తమకు అనుకూలంగా భాష్యాలు చెప్పుకున్నారు. నిజానికి చట్టాలను ఉల్లంఘిస్తున్న వారు చట్టాలను అమలు చేయాలని కోరడమే పెద్ద తప్పు. ఎన్నో చట్టాలను చట్టుబండలు చేసిన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యేల విషయంలో మాత్రమే వారిని అనర్హులను చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చింది. ఎందుకంటే వారు అధికారంలో ఉండగా గంపగుత్తగా టిడిపి, సిపిఐ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న విషయం ప్రజలు మరచిపోలేదు. వారిని ఎలా చేర్చుకున్నా తప్పే. ఎందుకంటే రాజకీయంగా నిజాయితీగా లేరని ఈ విషయం స్పష్టం చేసింది. దీనికి వక్రభాష్యాలు చెప్పడం బిఆర్ఎస్ నేతలు మానుకోవాలి. గొర్రెల స్కామ్‌లో వేయికోట్లు, కాళేశ్వరంలో లక్షకోట్లు, రైతుబంధులో వేలకోట్లు, ఈ ఫార్ములా రేసులో కొన్నికోట్లు ఇలా దోచుకుని చట్టాలను చట్టుబండలు చేసి, ప్రజాధనాన్ని దోచుకున్న వారికి ఫలాన చట్టం అమలు చేయాలని కోరడం లేదా డిమాండ్ చేయడం సరికాదు. అలాంటి అర్హత వారికి ఎప్పటికీ లేదు. అందుకే సుప్రీం తీర్పు వచ్చినా ప్రజల్లో ఎక్కడా పెద్దగా స్పందన కానరావడం లేదు. ఇక సుప్రీం తీర్పు అమలు చేయాలంటే బిఆర్ఎస్ ప్రభుత్వం గురించి ఓ విషయం చెప్పుకోవాలి. హైదరాబాద్‌లో ఉమ్మడి ఎపిలో వైఎస్ సిఎంగా ఉన్న సమయంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చారు. దీనిపై కోర్టులో నలిగి చివరకు సుప్రీం కోర్టు జర్నలిస్టులకు స్థలం అప్పగించాలని ఆదేశించింది. సుప్రీం చీఫ్ జస్టిస్ ఇచ్చిన ఆదేశాన్ని కూడా ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఆనాడు సుప్రీం తీర్పును పట్టించుకోని, అమలు చేయని పాలకులు బిఆర్ఎస్ నేతలు. తీర్పులను పట్టించుకోని వీరు పాలనకు అనర్హులు. చట్టాలను ఉల్లంఘించడం, వాటిని అమలు చేయకపోవడం, పూర్తిగా అవినీతిలో కూరుకు పోవడం,కుటుంబ సభ్యులకే పదవులు కట్టబెట్టుకోవడం వంటి అనేక అరచకాలకు పాల్పడ్డవారు పాలకులుగా అనర్హులు. అలాంటి వారు సుప్రీం తీర్పు అమలుచేయాలని కోరడంలో అర్హత లేదు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉందని బిఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోంది. ఈ పరిస్థితుల్లో ఉప ఎన్నికలు వస్తే గెలుపు తమదే అన్న ధీమాతో బిఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించి ఉంటుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సహజంగానే ఉప ఎన్నికలు వస్తే ఇబ్బంది ఉంటుంది. అందుకే ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి పార్టీ ఫిరాయిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం లేకపోతే ఎమ్మెల్యేలు గెలిచిన పార్టీలో కాకుండా అధికారంలో ఉన్న పార్టీలో ఉంటారు. బిఆర్ఎస్ నుంచి ఏడాది క్రితమే మరో పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టేవారు. ఇప్పటకే ఓ 20 మంది గోడదూకేవారు. ఈ నేపథ్యంలో ఎన్నికైన సభ్యులు చేజారి పోకుండా కాపాడు కోవడంతో పాటు, పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని పార్టీ శ్రేణుల్లో నమ్మకం కల్పించేం దుకు బీఆర్ఎస్ నానా తంటాలు పడుతోంది. అందుకే ఉప ఎన్నికలు రావాలని కోరుకుంటోంది. ఈ కారణంగానే మూడు నెలల తర్వాత ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. నిజానికి ఒకప్పుడు చట్ట సభల స్పీకర్లు పార్టీలకు అతీతంగా, న్యాయబద్ధంగా నడుచుకొనేవారు. వారి నిర్ణయాలు పార్టీలకు అతీతంగా చట్టబద్ధంగా ఉండేవి. కాలక్రమంలో స్పీకర్లు చట్టసభల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల ప్రయోజనాలకు అనుగుణంగా స్పీకర్లు నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. గత బిఆర్ఎప్ ప్రభుత్వ హయాంలో నాటి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇలాగే వ్యవహరించారు. పార్టీ ఆదేశాల మేరకు నడుచుకున్నారు. ఆనాడు లేని నిబంధనల గురించి ఇవాల బిఆర్ఎస్ వాదిస్తోంది. నిజానికి సభలోఅసలు చర్చకే ప్రాధాన్యం లేకుండా పోయింది. కేవలం ఇప్పుడే మళ్లీ అసెంబ్లీలో చర్చలు సాగుతున్నాయి. స్పీకర్లు సరైన నిర్ణయం తీసుకోక పోవడం వల్లనే స్పీకర్ల అధికారాల్లో జోక్యం చేసుకొవాలని సుప్రీం గడప తొక్కుతున్నారు. సర్వోన్నత న్యాయస్థానానికి సైతం పరిమితులు ఉన్నందున వివాదాలు సత్వరం పరిష్కారం కావడం లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ ఆశించింది. అప్పటికే పార్టీ ఫిరాయించిన వారిపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటుందని బలంగా చెప్పడం ద్వారా మరికొందరు పార్టీ ఫిరాయించకుండా బీఆర్ఎస్ అడ్డుకోగలిగింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఆ పార్టీకి ఆశాభంగం కలిగించింది. ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు మూడు నెలల గడువు విధించింది. ఈ గడువుకు లోబడి స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలన్నా, చట్టసభలు-న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ తలెత్తరాదన్నా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్‌కు పార్లమెంటు గడువు విధించాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో పేర్కొంది. స్పీకర్ వద్ద వివాదాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడం సరికాదు. ఫిరాయింపుల నిరోధక చట్టం అపహాస్యం కాకుండా సత్వర చర్యలు తీసుకోవాలి. పాలకులుగా ఏ పార్టీ వారు ఉన్నా చట్టాలు సక్రమంగా అమలు కావాలి. అధికార పార్టీ ప్రయోజనాలు కాపాడటానికి స్పీకర్లు ప్రాధాన్యం ఇస్తున్నందున సమస్యలు వస్తున్నాయి. సకాలంలో నిర్ణయాలు వెలువడటం లేదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేలను నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇలా చేయడం అనైతికం, అక్రమం అని టీఆర్ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్ ఆక్రోశించారు. ఒక పార్టీ తరపున గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక, ముఖ్యమంత్రి అయిన కెసిఆర్ కూడా కాంగ్రెస్-తెలుగుదేశం - కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సభ్యులను తమ పార్టీలో కలుపుకొన్నారు. అప్పట్లో శాసనసభలో కేసీఆర్‌కు బొటాబొటి మెజారిటీ మాత్రమే ఉన్నందున భయంతో వీరిని చేర్చుకున్నారు. అయినా ఆనాడు తప్పని వాదించిన కెసిఆర్ తరవాత అదే పద్ధతిలో వెళ్లడం ముమ్మాటికీ తప్పుగానే భావించాలి. రెండోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి అయినప్పుడు కూడా సభలో సొంతంగా కావల్సినంత మెజారిటీ ఉన్నా కాంగ్రెస్, తెలుగుదేశం సభ్యులను చేర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లభించకుండా చేశారు. నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చిన కేసీఆర్ చర్యను అంతా ఆక్షేపించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అప్పట్లో తన చర్యను సమర్థించుకున్న బిఆర్ఎస్‌కు ఇవాళ కాంగ్రెస్ చర్యలు వ్యతిరేకించడం సరికాదు. అందువల్ల స్పీకర్లు చట్టబద్ధంగా వ్యవహరించాలి. పాలకులు చట్టబద్దంగా నడుచుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం బలపడు తుంది.

# కాళేశ్వరం అవకతవకలపై కేసీఆర్ దే బాధ్యత.. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ రిపోర్ట్



హైదరాబాద్, కాళేశ్వరం ప్రాజెక్టు, బరాజ్‌ల నిర్మాణంలో అవతవకలకు అప్పటి తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుదే బాధ్యత అని వీటిపై విచారణ చేసిన పీసీ ఘోష్ కమిషన్ తేల్చింది. అనేక సంచనల విషయాలను కమిషన్ తన నివేదికలో ప్రస్తావించింది. 'విధానపరమైన, ఆర్థికపరమైన బరితెగించిన అవకతవకలకు ప్రబలమైన తార్కాణం ఈ ప్రాజెక్టు" అని కమిషన్ అభిప్రాయపడింది. వ్యాప్కోస్ నివేదికను "పక్కనపడేయడానికి" కారకులైన అధికారుల నుంచి (వ్యాప్కోస్‌కు చెల్లించిన) 6.7767 కోట్ల రూపాయలను తిరిగి వసూలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. "ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ ఏజెన్సీ దురుద్దేశపూర్వకంగా కుమ్మక్కయి అంతర్గతంగా, అనైతికంగా, చట్టవిరుద్ధంగా భారీ ప్రయోజనం పొందడానికి మేడిగడ్డ బరాజ్ నిర్మాణంపై ప్రజాధనాన్నిఅసాధారణ రీతిలో ఖర్చు చేయడంపై" ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలని సూచించింది. "తెలంగాణ రాష్ట్రానికి జీవనాడి" కావలసిన ఈ ప్రాజెక్టు వ్యక్తిగత స్థాయిలో నిర్ణయాలు, రాజకీయ నాయకత్వం అసాధారణ జోక్యం, పాలన, ప్రణాళికా, సాంకేతిక పర్యవేక్షణ, ఆర్థిక క్రమశిక్షణ వైఫల్యాల వల్ల ప్రజాధనాన్ని ఘోరంగా వృధా చేసిన ప్రాజెక్టుగా మిగిలిపోయింది అని నివేదిక పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు, బరాజ్‌ల నిర్మాణంలో డిజైన్ లోపాల ఆరోపణలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2024 మార్చి 14న జస్టిస్ పినాకిని ఘోష్ నేతృత్వంలో జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఈ ఏడాది జూలై 31న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించింది. 650 పేజీల నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల బృందం అధ్యయనం చేసింది. ఈ రిపోర్టును సోమవారం క్యాబినెట్ సమావేశంలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రవేశపెట్టారు.

**నిపుణుల కమిటీ నిర్ణయాన్ని పట్టించుకోలేదు**

కాళేశ్వరం ప్రాజెక్టు, ఇందులో అంతర్భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్ రావుదే నిర్ణయమని కమిషన్ పేర్కొన్నది. ఇందులో ప్రభుత్వ అధికారిక నిర్ణయం లేదని తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీని 2015 జనవరి 1న ఏర్పాటు చేశారు. ఈ మేరకు జీవో 28 జారీ చేశారు. మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణాన్ని ఈ కమిటీ వ్యతిరేకించింది. వేమనల్లి వద్ద ప్రత్యామ్నాయాలను కమిటీ సూచించింది. కానీ, ఈ ఎక్స్ పర్ట్ కమిటీ సూచనలను అప్పటి సీఎం, ఇరిగేషన్ మంత్రి ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారని కమిషన్ తెలిపింది. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చాలనే ప్రతిపాదన విషయంలో కూడా సరైన కారణం కూడా చూపలేదని రిపోర్ట్ స్పష్టంచేసింది. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదనే వాదనలో నిజాయతీ లేదని కమిషన్ అభిప్రాయపడింది. 'మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి 2016 మార్చి 1న పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు 231, 232, 233 జీవోలు జారీ చేశారు. ఈ విషయాన్ని క్యాబినెట్ ముందుకు తీసుకురాలేదు, ఆమోదించలేదు. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం' అని జస్టిస్ ఘోష్ కమిటీ రిపోర్టు తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ. 71,436 కోట్లు అంటూ 2016 ఫిబ్రవరి 11న ప్రధానికి అప్పటి సీఎం లేఖ రాశారు. అయితే ఈ లేఖ రాసే సమయానికి వ్యాప్కోస్ సంస్థ తుది డీపీఆర్ ఇవ్వలేదని పేర్కొన్నది. వ్యాప్కోస్ తుది డీపీఆర్ ఇవ్వకముందే ఈ లేఖ రాసినట్టు కమిటీ గుర్తించింది.

**సీడబ్ల్యూసీ సూచనలు పట్టించుకోలేదు**

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకు వచ్చే కాంట్రాక్టు సంస్థలకు నిర్మాణం, నిర్వహణను టర్న్ కీ ప్రాతిపదికన ఇవ్వాలని సీడబ్ల్యూసీ సూచించింది. కానీ, ఈ ప్రతిపాదనను ప్రభుత్వం పక్కన పెట్టిందని రిపోర్టు తెలిపింది. వ్యాప్కోస్‌ను సంప్రదించకుండానే 2016 ఆగస్టులో బరాజ్‌ల నిర్మాణాన్ని మార్చాలని నిర్ణయం తీసుకున్నారని కమిషన్ తెలిపింది. ఆపరేషన్, నిర్వహణలో నిర్లక్ష్యం, లోటుపాట్లను కూడా కమిటీ ఎత్తి చూపింది. ఈ మూడు బరాజ్‌ల విషయంలో సరైన నిర్వహణ లేని విషయాన్ని కూడా కమిటీ గుర్తించింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంలలో బ్యాక్ వాటర్ స్టడీస్, టెయిల్ వాటర్ రేటింగ్, భూమి పరిస్థితులపై అధ్యయనాలు చేయలేదని కమిటీ తేల్చింది. బరాజ్ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని రిపోర్ట్ బయటపెట్టింది.

**అక్రమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కేసీఆర్ బాధ్యుడు**

మూడు బరాజ్‌ల ప్రణాళిక, నిర్మాణం, పూర్తి, నిర్వహణలో జరిగిన అక్రమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అప్పటి సీఎం కేసీఆర్‌దే బాధ్యత అని కమిషన్ అభిప్రాయపడింది. ఈ మూడు బరాజ్‌ల అవకతవకలు, నిర్మాణ లోపాలు, ఇతర అంశాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయనదే బాధ్యతగా తేల్చింది. ఈ ప్రాజెక్టు విషయంలో మాజీ ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా కిందిస్థాయి వరకు ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నది. అప్పటి సీఎం కేసీఆర్‌తోపాటు నిపుణుల కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకోలేదని అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్ రావు గురించి తెలిపింది. అప్పట్లో ఆర్థికశాఖ మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్థిక అంశాల గురించి తెలియదని వాదించడాన్ని కమిషన్ ప్రస్తావించింది.

**అధికారుల తీరును తప్పుబట్టిన పీసీ ఘోష్ కమిషన్**

అప్పట్లో నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఎస్ కే జోషి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారని కమిషన్ తేల్చి చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను పక్కన పెట్టడంతో ఈ ప్రాజెక్టు వైఫల్యాలకు ఆయనే బాధ్యుడని కమిటీ తేల్చి చెప్పింది. క్యాబినెట్ ఆమోదం, నిబంధనలు పాటించడంలో వైఫల్యం, నిర్లక్ష్యం, బిజినెస్ రూల్స్ పాటించకపోయినా పట్టించుకోలేదని అప్పట్లో సీఎంవో సెక్రటరీగా పనిచేసిన స్మితా సభర్వాల్ తీరును గురించి కమిటీ వ్యాఖ్యానించింది. సీడబ్ల్యూసీకి తప్పుడు సమాచారం ఇవ్వడం, దురుద్దేశంతో సవరించిన అంచనాలు ప్రతిపాదించడం, ఆపరేషన్స్, మెయింటనెన్స్ విషయంలో నిర్లక్ష్యానికి అప్పటి ఇరిగేషన్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాధ్యుడని రిపోర్ట్ తెలిపింది. అప్పట్లో ఈ ప్రాజెక్టులో పనిచేసిన బీ హరిరామ్, ఎన్ వెంకటేశ్వర్లు, కే సుధాకర్ రెడ్డి, ఓంకార్ సింగ్ నాగేందర్ రావు వంటి అధికారుల నిర్లక్ష్యాన్ని కూడా కమిషన్ ఎత్తిచూపింది.

# భారతీయ సమాజంలో ఎవరు ఓసీలు.. ఎవరు బీసీలు..?



హైదరాబాద్,చారిత్రకంగా భారతీయ సమాజం కుల వ్యవస్థ ఆధారంగా శతాబ్దాలుగా నిర్మితమై ఉంది, ఇది సామాజిక, ఆర్థిక, రాజకీయ గతిశీలతలను ప్రభావితం చేస్తున్నది. ఈ వ్యవస్థను ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ (ఓసీ), వెనుకబడిన కులాలు (బీసీ లేదా ఓబీసీ), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), మరియు షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) అనే వర్గాలుగా విభజించారు. బ్రిటిష్ పాలనా కాలంలో 1881 నుండి 1931 వరకు నిర్వహించిన జనగణనలు కుల ఆధారిత జనాభా వివరాల్ని సేకరించాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కల్లో కులాల వివరాల్ని నమోదు చేయలేదు, కాబట్టి ఆయా సామాజిక వర్గాల వారీగా ఖచ్చితమైన జనాభా శాతాలపై స్పష్టత లేదు. స్వాతంత్ర్య అనంతరం భారత ప్రభుత్వం కుల గణనను నిలిపివేసి, పదేళ్ళకోసారి చేసే జనగణనలో ఎస్సీ మరియు ఎస్టీ గణనపై దృష్టి సారించింది, దీనివల్ల ఓసి, ఓబీసీ జనాభా డేటా లభ్యత పరిమితమైందని చెప్పవచ్చు.ఓసీ మరియు బీసీల గుర్తింపు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది. ఓసీ కేటగిరి సాధారణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో పాటు రిజర్వేషన్ ప్రయోజనాలు పొందని ఇతర కులాల్ని కూడా సూచిస్తుంది. బీసీ లేదా ఓబీసీ కులాలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4) కింద నిర్వచించబడ్డాయి. కానీ, కుల వర్గీకరణలో కొంత సంక్లిష్టత నెలకొని ఉంది, కేంద్ర జాబితాలో ఓబీసీలుగా గుర్తించబడిన కొన్ని కులాలు వివిధ రాష్ట్రాలలో ఓసీ, ఎస్సీ, లేదా ఎస్టీలుగా వర్గీకరించద్దాయి.ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1970 వ దశకం వరకు బీసీ జాబితాలో ఉన్న లంబాడా సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగింది. వందకు పైగా ఉన్న బీసీ కులాల్ని ఏ, బీ, సీ, డీ, ఈ గ్రూపులుగా విభజించారు, తెలంగాణలో మున్నూరు కాపులు బీసీ జాబితాలో ఉంటే ఆంధ్ర ప్రదేశ్ లో కాపులు ఓసీ జాబితాలో ఉన్నారు. కర్ణాటకలో రెడ్లు బీసీ జాబితాలో ఉంటే తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఓసీలుగా ఉన్నారు. ఇలా వివిధ కులాలు కేంద్ర, రాష్ట్రాల జాబితాలు వేర్వేరుగా ఉండటం వల్ల ఒక రాష్ట్రంలో ఓసీలుగా ఉన్నవారు, మరొక రాష్ట్రంలో బీసీల జాబితాలో ఉన్నారు. ముస్లిం మైనారిటీల్లో కొన్ని కులాలు బీసీ జాబితాలో ఉంటే, మరికొన్ని ఓసీ జాబితాలో ఉన్నారు.ఇక్కడే అసలు దేశంలో ఓసీలు ఎవరు..? బీసీలెవరు అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. జన్మ ద్వారా వచ్చిన కులాన్ని మార్చడం సాధ్యం కాదు కానీ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనకబాటు ఆధారంగా వారికి రిజర్వేషన్ కల్పించి వారి పురోభివృద్ధికి చర్యలు తీసుకోవడం అనివార్యం. అందుకే ప్రభుత్వం కుల, మత, వర్గాలకు అతీతంగా బీసీ, ఎస్సీ ఎస్టీ వర్గాలతో పాటు వారి రిజర్వేషన్ ప్రయోజనాలకి భంగం కలగకుండా ఓసీల్లో ఉన్న పేదలకు కూడా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించింది. ఈ అంశంపై సుప్రీం కోర్టులో వాదనలు జరిగినపుడు ఈ చట్టానికి అనుకూలంగా తీర్పు రావడం గమనార్హం.1953లో ఏర్పాటైన కాకా కలేల్కర్ కమిషన్ దాదాపు రెండు వేలకు పైగా వెనుకబడిన కులాలను గుర్తించింది, కానీ దాని సిఫార్సులు అమలు కాలేదు. 1979లో ఏర్పాటైన మండల్ కమిషన్ దాదాపు మూడు వేల కులాలను ఓబీసీలుగా వర్గీకరించి, 27% రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో సిఫారసు చేసింది. 1990లో వి.పి. సింగ్ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేసింది, ఇది దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారింది. 1992లో ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు 27% రిజర్వేషన్‌ను సమర్థించి, క్రీమీ లేయర్‌ను మినహాయించాలని ఆదేశించింది. తదనంతరం, ఈ రిజర్వేషన్ ప్రభుత్వ విద్య, ఉద్యోగ అవకాశాలకు విస్తరించబడింది.రిజర్వేషన్ విధానం ఓబీసీలకు విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, రాజకీయ రిజర్వేషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్నట్లు ఓబీసీలకు చట్ట సభల్లో ప్రత్యేక కోటా లేదు, భారతీయ సమాజంలో ఎస్సీ, ఎస్టీలతో పోల్చితే కొంతవరకు సామాజికంగా, ఆర్థికంగా బీసీలు పురోభివృద్ధి సాధించినందున ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దాదాపు జనాభా శాతానికి సమానంగా రిజర్వేషన్ కల్పించినట్టు, బీసీ జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్ కల్పించి ఉండక పోవచ్చు.జనాభా దామాషా ప్రకారం ఇస్తే ఇక ఓపెన్/ మెరిట్ కోటా ఏముంటుందనే వాదనలు కూడా ఉన్నాయి.సమకాలీన సందర్భంలో, కుల గణన అనేది ఒక కీలక అంశంగా మారింది. ఈసారి జరగనున్న జనగణనలో కులగణన కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గణన ఆయా సామాజిక వర్గాల జనాభా, ఆర్థిక స్థితిగతులపై స్పష్టతనిచ్చే అవకాశం ఉంటుంది.ఆయా సామాజిక వర్గాలకి పూర్తి స్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందాలంటే క్రీమీ లేయర్ని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంటుంది. ఆర్థికంగా స్థిరపడిన సామాజిక వర్గాలు తర తరాలుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం వల్ల, నిజంగా వెనుకబడిన కులాలకు అవకాశాలు తగ్గుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. వందలాది కులాలుంటే కేవలం ఐదారు కులాలే సామాజిక, ఆర్థిక రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని సమీక్షించడం ద్వారా రిజర్వేషన్ ఫలాల్ని అట్టడుగు వర్గాలకు అందించే ప్రయత్నం చేయవచ్చు. రాష్ట్రాలకు ఓబీసీ జాబితాలను నిర్వహించే అధికారం 2021లో 105వ రాజ్యాంగ సవరణ ద్వారా పునరుద్ధరించబడింది, కానీ రాజ్యాంగం ప్రకారం జనగణన చేసే అధికారం కేంద్ర ప్రభుత్వం వద్దనే ఉంది.ఓసీ మరియు బీసీల గుర్తింపు భారతీయ సమాజంలో సామాజిక న్యాయం, అవకాశాల కల్పనలో కీలకమైన అంశం. 1931 జనగణన ఆధారంగా అంచనా వేయబడిన జనాభా శాతాలు దాదాపు వందేళ్ళ క్రితం సేకరించబడినవి. ఎవరికి వారు తమ కుల జనాభాను ఎక్కువ చేసి చెప్పుకోవడం సహజం, కానీ ఆ గణాంకాల పై స్పష్టత లేదు. ప్రతి జనగణన లో ఎస్సీ,ఎస్టీల జనాభా వివరాల్ని సేకరిస్తున్నప్పటికీ రాబోయే జనగణనతో పాటు చేసే కుల గణన ఈ అంతరాన్ని పూరించి, ఖచ్చితమైన గణాంకాల్ని (డేటా)తో, రిజర్వేషన్ విధానాలను మరింత సమర్థవంతం చేయగలదు. వివిధ రాష్ట్రాలలో కుల వర్గీకరణల సంక్లిష్టత, ఓటు బ్యాంకు రాజకీయాలు, మరియు క్రీమీ లేయర్ వంటి సవాళ్లు సామాజిక న్యాయ సాధనలో అడ్డంకులుగా ఉన్నాయి. వచ్చే జనగణన ఫలితాలు ఈ సవాళ్లను అధిగమించి, సమానత్వం, సామాజిక న్యాయ సాధనకు దోహదపడాలి.ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయి.సామాజిక అసమానతలు తగ్గి ఆర్థిక అసమానతలు ఎక్కువై

# షూటింగ్‌లకు కొత్త వారికి కూడా అవకాశం

హైదరాబాద్,తెలుగు ఫిలిం ఛాంబర్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి షూటింగ్ లకు కొత్త వారికి కూడా అవకాశం కల్పించాలని నిర్ణయించింది. సభ్యత్వం లేనివారిని కూడా షూటింగ్ లకు తీసుకోవాలని ఫిలిం ఛాంబర్ భేటీలో నిర్ణయించారు. కార్మికుల జీతాల పెంపును వ్యతిరేకిస్తున్నట్లు- సోమవారం ప్రకటన విడుదల చేసింది. వేతనాలు పెంచాలని గత కొంత కాలంగా కార్మికులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. వేతనాల పెంపుపై ఫిలిం ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నాకు దిగారు. షూటింగ్ లను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. జీతాలు పెంచే వరకు విధులకు హాజరయ్యేది లేదని తేల్చిచెప్పారు. కార్మికుల డిమాండ్లపై ఫిలిం ఛాంబర్ సభ్యులు భేటీ అయ్యారు. కార్మిక సంఘాలు కోరుతున్నట్లు- 30 శాతం జీతాల పెంపు సాధ్యం కాదని ప్రకటన విడుదల చేసింది. తెలుగు సినీ పరిశ్రమ ఇబ్బందుల్లో ఉందని.. ఈ పరిస్థితుల్లో జీతాలు పెంచాలనడం సరికాదని ప్రకటనలో పేర్కొంది. సామరస్య పూర్వకంగా చర్చలు జరుపుతున్న సమయంలో ఆందోళనలు నిర్వహించడం సమంజసం కాదని తెలిపింది. కార్మికుల వేతనాల పెంపుతో చిన్న నిర్మాతలు ఇబ్బందులకు గురవుతారని.. వారు ఆర్థిక భారాన్ని భరించలేరని.. వేతనాల పెంపును నిర్మాతలందరూ ఏకగ్రీవంగా వ్యతిరేకించినట్లు- ప్రకటనలో పేర్కొంది. కనీస వేతన చట్టం ప్రకారం ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని తెలిపింది. హైదరాబాద్ లో లివింగ్ కాస్ట్ ఇతర నగరాలతో పోల్చితే తక్కువే ఉందని.. ఇతర సినీ పరిశ్రమలు ఇస్తున్నదాని కంటే ఇక్కడ ఎక్కువ వేతనాలు ఇస్తున్నట్లు- ఫిలిం ఛాంబర్ తెలిపింది. ఈ క్రమంలో ఫిలిం ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు- ప్రకటించింది. ఇక నుంచి యూనియన్ లో సభ్యత్వం లేని కార్మికులకు సైతం అవకాశం కల్పించాలని సభ్యులు నిర్ణయించారు. సినీ పరిశ్రమలో పనిచేసేందుకు ఎంతో మంది కార్మికులు సిద్ధంగా ఉన్నప్పటికీ.. యూనియన్ లలో సభ్యత్వం కోసం లక్షల్లో డిమాండ్ చేస్తూ కొత్త వాళ్లను రానివ్వటం లేదని.. ఇది ఎంతో మంది కార్మికుల పొట్టకొట్టడమే అవుతుందని టీ-ఎఫ్ సీసీ పేర్కొంది. అందుకోసం ఇక నుంచి కొత్త వారికి కూడా అవకాశాలు కల్పించాలని నిర్ణయించుకున్నట్లు- ప్రకటనలో పేర్కొంది.

# కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ సక్సెస్

చిత్తూరు,కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ సక్సెస్ అయ్యిందని ఏపీ డిప్యూటీ-సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆపరేషన్ కుంకీతో సరిహద్దు ప్రాంత రైతులకి భరోసా అని అన్నారు. పంటల్ని ధ్వంసం చేస్తున్న ఏనుగుల్ని.. కుంకీలు దారి మళ్లించాయి.. తొలి ఆపరేషన్ విజయవంతం చేసిన అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలి వద్ద మామిడి తోటలను ధ్వంసం చేస్తున్న అటవీ ఏనుగుల గుంపుని కుంకీలు విజయవంతంగా దారి మళ్లించి అడవిలోకి తరిమికొట్టినట్టు- అటవీ శాఖ అధికారులు తెలిపారు. కృష్ణ, జయంత్, వినాయక అనే కుంకీలు ఆ ఆపరేషన్ లో పాల్గొని అడవి ఏనుగులను పంటల వైపు రాకుండా అడ్డుకుని తిరిగి అడవిలోకి మళ్లించాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్ లో కర్ణాటక నుంచి తీసుకువచ్చిన కృష్ణ అనే కుంకీ ఏనుగు చాలా చురుకుగా పాల్గొన్నట్టు- అటవీ అధికారులు తెలియజేశారు. మొగిలి ప్రాంతంలో 15 రోజులుగా ఏనుగుల సంచారం ఉన్న సమాచారంతో అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చిన అనంతరం రెండు నెలల శిక్షణ తర్వాత మొదటి ఆపరేషన్ విజయవంతంగా చేపట్టడం ఆనందాన్నిచ్చింది. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏనుగుల గుంపు నుంచి పంటలను, ప్రజల ప్రాణాలు కాపాడే దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తుంది అనడానికి కుంకీలతో చేపట్టిన ఆపరేషన్ తొలి అడుగు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న అటవీ అధికారులకు, మావటిలు, కావడిలకు అభినందనలు తెలియజేస్తున్నాను. అలాగే అడిగిన వెంటనే కుంకీ ఏనుగులు రాష్ట్రానికి ఇచ్చి సహకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, ఆ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తదుపరి ఆపరేషన్ పుంగనూరు అటవీ ప్రాంతంలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు- చేస్తున్నారని తెలిపారు.

# జీరో క్యాడర్...

హైదరాబాద్,కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్ కు దూరంగా.. జాగృతిపేరుతో సొంతంగా ఎదుగడానికి అడుగులు వేస్తోంది. తండ్రి, సోదరుడికి దూరంగా బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా అడుగులువేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఓటమి తర్వాత తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత రాజకీయ వైఖరి అందరినీ షాక్ కు గురిచేస్తోంది.. కష్టాల్లో ఉన్న పార్టీకి పునర్నిర్మాణం అవసరమైన ఈ సమయంలో, కవిత తీరుపై పార్టీ అంతర్గతంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆమె వెంట పార్టీ శ్రేణులు లేకపోవడం, కేడర్‌లోనూ వ్యతిరేకత పెరిగిపోతుండటం ఈ చర్చకు ప్రధాన కారణం.

**ప్రత్యర్థులకు ఊతం ఇస్తున్నారా?**

బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంది. ఈ సమయంలో పార్టీ శక్తివంతంగా పోరాడి, ప్రజల సమస్యల కోసం గొంతెత్తాలి. కానీ కవిత వ్యవహార శైలి మాత్రం ప్రత్యర్థులకు మద్దతుగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత తండ్రి కేసీఆర్, అన్న కేటీఆర్‌లకు వ్యతిరేకంగా పరోక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పార్టీ శ్రేణుల్లో అయోమయానికి దారితీస్తున్నాయి. ఇది పార్టీ పురోగతిని అడ్డుకుంటుందని పార్టీలోని కొందరు అభిప్రాయపడుతున్నారు.

**పార్టీకి దూరమవుతున్న కవిత?**

ప్రస్తుతం కవిత వెంట బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా మధ్యస్థాయి కేడర్, నిలబడటం లేదు. ఒంటరిగా వెళుతున్న ఆమెతో కలిసి పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని స్పష్టమవుతోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం ఆమె ఇటీవల వ్యవహరిస్తున్న తీరేనని పార్టీలో చర్చ జరుగుతోంది. ఇటీవల ఆమె రాసిన 'ఓపెన్ లెటర్' కూడా రాజకీయంగా పెద్దగా స్పందన పొందలేదు. ఈ లేఖ ద్వారా ప్రజల్లో తనకు మద్దతు ఉందనే ప్రచారం జరిగినా, వాస్తవానికి బీఆర్ఎస్‌లో ఆమెకు మద్దతు లేదనేది తేటతెల్లమవుతోంది.

**షర్మిల తరహాలో...**

దివంగత నేత వైఎస్ఆర్ కుటుంబంలో షర్మిల పరిస్థితిని గుర్తు చేస్తూ, ఇప్పుడు కవితను కూడా అదే కోణంలో చూస్తున్నారు. వైఎస్ఆర్ మరణం తర్వాత షర్మిల తన సొంత రాజకీయ మార్గాన్ని ఎంచుకున్నట్లే, కవిత కూడా బీఆర్ఎస్ నుంచి బయటికి వెళ్లి తన సొంత మార్గాన్ని ఎంచుకోవచ్చని కొందరు భావిస్తున్నారు. అయితే, కష్టకాలంలో రాజకీయ చతురత చూపకుండా, కేవలం మీడియాలో

# తిరుమల భద్రతకు టిటిడి పెద్దపీట

తిరుమల,టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలపై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి స్పందించారు. తిరుమలలో ఏదో జరిగిపోతుందని భూమన కరుణాకర్ రెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం తిరుమలలో భానుప్రకాష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తిరుమలలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాల హెచ్చరికలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. మూడంచెల భద్రతలో భాగంగా శ్రీవారి ఆలయం, భక్తులకు టీటీడీ భద్రత కల్పిస్తోందని భానుప్రకాష్ రెడ్డి ఉద్ఘాటించారు. భక్తుల భద్రత కోసమే మఠాలకు నోటీసులు ఇచ్చామని భానుప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. స్వామి వారికి నిత్య కైంకర్యాలు చేస్తున్న మఠాలు, పీఠాధిపతులంటే టీటీడీకి చాలా గౌరవం ఉందని ఉద్ఘాటించారు. మఠాల్లోనూ భక్తుల ఆధార్ వివరాలు తీసుకొని వసతులు కల్పించాలని నోటీసులు ఇచ్చామని గుర్తుచేశారు. తిరుమలలో భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు-చేయాలని సూచించామని పేర్కొన్నారు. వివరాలు తీసుకోవాలంటే.. హిందూధర్మం, మఠాలపై దాడి అని భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడతారా.. అని ప్రశ్నించారు. తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చింది వైసీపీయేనని భానుప్రకాష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఏఐ టెక్నాలజీని వినియోగించి భక్తులకు సులభతరంగా దర్శనం కల్పించడం సాధ్యం కాదంటూ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఖండించారు. టె-క్నాలజీపై అవగాహన లేకుండా ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. భక్తులకు సులభతరంగా దర్శనం కల్పించే అంశంపై అధ్యయనం చేసేందుకు గూగుల్, టీసీఎస్ సంస్థలు ముందుకు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ సంస్థలు టీటీడీకి ఉచితంగా సేవలు అందిస్తున్నాయని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. దాతల సహాయంతో చేస్తున్న పనిని కూడా వృథా అనడాన్ని ఎల్వీ సుబ్రహ్మణ్యం విజ్ఞతికే వదిలేస్తున్నానని హితవు పలికారు. శ్రీవారి దర్శనం కోసం భక్తులు రోజుల తరబడి క్యూ లైనల్లో పడిగాపులు ఉండటం మంచిదా..? అని ప్రశ్నించారు. ప్రపంచం మొత్తం ఏఐ టెక్నాలజీని వినియోగస్తోందని గుర్తు చేశారు. భక్తుల ఇబ్బందులు తొలగించడానికే ఏఐ టెక్నాలజీని వినియోగించాలని టీటీడీ బోర్డు తీర్మానం చేసిందని..ఇందులో ఎలాంటి తప్పు లేదని నాయుడు పేర్కొన్నారు.

## అత్తింటి వేధింపులకు నవవధువు మృతి

విజయవాడ,పెళ్లయిన ఐదు నెలలకే అనుమానాస్పద రీతిలో నవవధువు మృతి చెందింది. ఈ ఘటన కృష్ణా జిల్లా ఉయ్యూరులో చోటుచేసుకుంది. మొవ్వ మండలం కొండవరం గ్రామానికి చెందిన నాగరాజు, శివనందేశరమ్మల కుమార్తె శ్రీవిద్యకు ఏప్రిల్ 23న కంకిపాడు మండలం కుందేరుకు చెందిన అరుణ్‌కుమార్‌తో ఆమెకు వివాహమైంది. అరుణ్ ఉయ్యూరు మండలం కలవపాములలో సర్వేయర్‌గా ఉద్యోగం చేస్తుండగా.. శ్రీవిద్య ఓ ప్రైవేటు-కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. పెళ్లయిన నాటి నుంచి శ్రీవిద్యకు అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆమె ఆదివారం మృతి చెందింది. భర్త తరచూ దాడి చేసి వేధిస్తున్నాడని.. భరించలేకపోతున్నానంటూ తండ్రికి శ్రీవిద్య లేఖ రాసినట్లు- తెలుస్తోంది. తనను వేధించిన భర్త, అత్తమామల్ని వదలొద్దని సూసైడ్ నోట్‌లో శ్రీవిద్య పేర్కొన్నట్లు- సమాచారం. ఆదివారం రాత్రి పన్నెండున్నర గంటల సమయంలో తమను వెంటనే రమ్మని ఫోన్ వచ్చిందని, తమ కుమార్తె ఇంటికి వెళ్లే సరికి శవమై కనిపించిందని మృతురాలి తల్లిదండ్రులు బోరున విలపించారు. అల్లుడే తన కుమార్తెను చంపి ఉంటాడని తండ్రి నాగరాజు ఆరోపిస్తున్నారు. ఉయ్యూరులోని తమ ఇంటిని అమ్మేసి డబ్బులివ్వాలని తన కుమార్తెను పెళ్లయిన రోజు నుంచే వేధిస్తున్నాడని, అప్పటికే రూ.10లక్షల కట్నం, రూ.10లక్షలు విలువైన బంగారం ఇచ్చినట్లు- తెలిపారు. నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసారు.

## కాశ్మీర్‌కు రాష్ట్రపతి హోదాపై ఊహాగానాలు

న్యూఢిల్లీ,జమ్మూకశ్మీర్ కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించనున్నారనే ప్రచారం ఒక్కసారిగా ఊపందుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదివారంనాడు ఒకరి తరువాత మరొకరు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ధ్రువీకరించింది. అయితే ఈ సమావేశాల వెనుక కారణం ఏమిటనేది మాత్రం స్పష్టం చేయలేదు. అమిత్‌షా తన కసరత్తులో భాగంగా పలువురు బీజేపీ నేతలు, అప్పటి జమ్మూకశ్మీర్ రాష్ట్ర బీజేపీ చీఫ్‌లతో సమావేశమైనట్టు- కూడా చెబుతున్నారు. ప్రధానమంత్రి మోదీ సైతం మంగళవారంనాడు ఎన్డీయే ఎంపీలతో కీలక సమావేశం జరుపనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆగస్టు 5న 370వ అధికరణ రద్దు యానివర్శిరీ కావడంతో ఆరోజు కీలక ప్రకటన ఏదో ఉండవచ్చని, ముందస్తు కసరత్తులో భాగంగానే కీలక సమావేశాలు జరుగుతున్నాయని ఊహాగానాలు వెలువడుతున్నాయి.కాగా, ఈనెల మొదటి రెండు రోజుల్లో జమ్మూకశ్మీర్ బీజేపీ మాజీ చీఫ్ సత్ పాల్ శర్మ, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తాలతో అమిత్‌షా సమావేశమయ్యారు. ఆల్ జమ్మూ అండ్ కశ్మీర్ షియా అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్రాన్ రజా అన్సారి సైతం సోమవారంనాడు అమిత్‌షాతో సమావేశమయ్యారు.ఢిల్లీలో వరుస సమావేశాల నేపథ్యంలో ఆగస్టు 5న కీలక ప్రకటన వెలువడే అవకాశాలపై సోషల్ మీడియాలోనూ చర్చ జరుగుతోంది. దీనిపై రిటైర్డ్ ఆర్మీ అధికారి, రచయిత కన్వల్ జీత్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ, కశ్మీర్‌లో శాంతి కోసం ఎన్నో విలువైన ప్రాణాలను కోల్పోయామని, ఆ కారణంగా ఎలాంటి తొందరపాటు- నిర్ణయాలు తీసుకోరాదని అన్నారు. శాంతి పునరుద్ధరణ ప్రక్రియ కొనసాగుతున్నందున్న పరిస్థితి మొత్తం సానుకూలమయ్యేంత వరకూ వేచిచూడాలని, హడావిడి నిర్ణయం మంచిది కాదని చెప్పారు. రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారనే బలమైన ఊహాగానాలు వస్తున్న విషయం నిజమేనని విశ్లేషకులు అన్నారు. అయితే మరో విచిత్రమైన వాదన కూడా వినిపిస్తోందని, కశ్మీర్, జమ్మూను వేరు చేసి రెండు వేర్వేరు రాష్ట్రాలుగా గుర్తిస్తారనే ప్రచారం ఒకటి ఉందని, అదే జరిగితే ఇంతకంటే వినాశకర పరిణామం మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు.

## రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ పన్ను ఎగవేత

న్యూఢిల్లీ, 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక సంవత్సరంలో 30,056 జీఎస్టీ ఎగవేత కేసులను గుర్తించినట్లు- ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది.

# బిసిల ఆత్మబంధువు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్,'రోజుకొక్క జంతువు సింహానికి ఆహారంగా మారుతున్న అడవిలో, నీలాంటోడే ఇంకోడు వున్నాడు అంటూ సింహాన్ని బావిలో పడేసి హతమార్చిన కుందేలు పిల్ల నిజమైన జ్ఞానవంతురాలు, 'జ్ఞానవంతులు సమాజానికి దిక్సూచి లాంటివారు, తాము ఉంటున్న సమాజానికి ఉన్నతంగా నిలుపాలని అనుకుంటారు. సమాజంలో భాగస్వాములైన అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని, శ్రేయస్సును కాపాడే సామాజిక ఉద్ధారకులు అవుతారు. సమాజ పరిణామ క్రమాన్ని నిశితంగా కుందేలు పిల్లలాగా గమనించినప్పుడే ఇలాంటి విషయాలు మనకి బోధ పడుతాయి. ఈ కోవకి చెందిన అరుదైన జ్ఞానవంతురాలు కల్వకుంట్ల కవిత. ఒక వ్యక్తి జీవితంలో ఉండే అనేక కోణాల్లో ఉద్యమం అనేది ఒక కోణమై ఉండొచ్చు. కానీ సబ్బండ వర్గాల సమస్యలే ఉద్యమం అయినప్పుడు, ఉద్యమమే జీవితం అయిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే తప్పకుండ ఆమె కవిత. వందల సంవత్సరాలుగా జ్ఞానానికి దూరం చేయబడ్డ, ఉత్పత్తి కులాలు దేశజనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలు, 80% పైగా ఈ దేశానికి సంపదను సృష్టించే సృష్టికర్తలు బిసిలు, ఏ రంగంలో కూడా బిసిలకు సరైనా సమాన వాటా లభించటం లేదు అన్న బిసిలా స్థూల ప్రయోజనాలను సూక్ష్మంగా కవిత పరిశీలించి చూసారు.ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన ఆధునికీకరణ, గ్రామాల్లో చేతివృత్తులను చేరిపి వేసింది. కుల వృత్తులన్నీ కూలిపోయి, బతుకు జీవుడా అంటూ పట్టణాలకు వలసలు పోయినాయి. నాగలి చెక్కి రైతుకు అందించే వడ్ల కమ్మర కులాలు, మట్టిని ప్రేమించి పూలకుండీలు, బొకేలు లేని కాలంలో ఇంటికి పెంకులను, ఆహార పాత్రలను, కల్లు లొట్లును, బోనం పటాలను అమ్మడం ద్వారా మెరిసిన కుమ్మరులు, ఆకాశానికి అంటి ఉన్న తాటి చెట్లను శరీరానికి మోకు అనే బంధనం వేసుకొని ఏ కాలంలోనైనా బతుకు పోరులో నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పోరాడే గౌడన్నలు, నేనేమి సేతును, నేనెట్ల బతుకుడు, ఊరోళ్లకు కల్లు పోస్తే ఉద్దెర అడిగితిరి, పైసలు అడిగితే కట్టేసి కొడతాం అంటిరి, ఊరు కానీ ఊరు పోయి కల్లును అమ్ముకుంటే కన్నెర్ర చేస్తిరి, బీరు, బ్రాందీలు వచ్చి ఎర్రమందు లోకమంత ప్రాకిపోయి తెల్లకల్లు తాగేటోడు లేక బతుకు భారమయ్యే, కులవృత్తిని నమ్ముకుంటే కూడుకు గతిలేకపాయె అని బతుకు భారమవుతున్న గౌడన్నల జీవితాలను, ఇలా అన్ని బిసి కులాల బతుకుల్లోకి తొంగిచూసింది, వారు అనుభవిస్తున్న బాధలను సూక్ష్మంగా గ్రహించారు కవిత.ఇలా చెప్పుకుంటూపోతే కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, గౌడ, యాదవ, కురుమ, పెరిక, కాపు, చాకలి, మంగలి, గంగపుత్ర, బెస్త, శాల, ఇతర సంచార జాతుల వందల కులాల చరిత్రలను, జీవన విధానాలను, వారికి ఉండే ఉపాధి అవకాశాలను, రాజకీయ ప్రాతినిధ్యాలను, విద్య, ఉద్యోగావకాశాలన్నింటినీ తరువుగా చూసింది. నిశితంగా తెలుసుకున్నది కవిత. తదనంతరం అనేక రాజకీయ కుట్రలు, కేసులతో ఒక మహిళను ఎంతగా ఇబ్బంది పెట్టకూడదో అంతగా ఇబ్బందిపెట్టిల్లు రాజ్యమేలే రాబందులు. అయినా వేరవకుండా నేను మొండి దాన్ని, నన్ను అన్యాయంగా జైలుకి పంపి జగమొండిని చేసిళ్ళు అని నాడు ప్రకటించినా, ఆ ప్రకటన రాజకీయ వర్గాల్లో వణుకు తెప్పించాయి. అదే వరవడిని, వాడిగా బిసి సమాజం వైపు కదిలించింది కవిత. అధికారదాహంతో ఉన్న కాంగ్రెస్ అనేక తప్పుడు హామీలను ఇచ్చింది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ బిసిలకు 42% వాటా రిజర్వేషన్స్ కల్పిస్తాం అని కామారెడ్డి డిక్లరేషన్ చేసింది. బిసిల ఓట్లు దండుకొని ఈ ఊసేలేకుండా కాలం ఎల్లదీస్తూపోతున్న కాంగ్రెస్‌కి కంట్లో నలుకలా మారింది కవిత.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తూనే బిసి ఉద్యమాన్ని తన భుజాలపైకి ఎత్తుకున్నది కవిత. ఈ మట్టి మనకు తినటానికి తిండినీ ఇస్తున్నది, బతకటానికి దారి చూపుతున్నది. ఈ మట్టే ఇల్లయి, ఇటుఇటుక అయ్యి మనకు ఇంత నీడను ఇస్తున్నది. తనువు చాలిస్తే తనలో మనల్ని దాచుకుంటుంది. ఈ మట్టితో రుణబంధం ఇంతేనా అని ప్రశ్నించుకున్నారు కవిత. కేవలం కూడు, గుడ్డ కల్పించినంత మాత్రాన ఈ సమస్య పరిష్కరింపపడదని నాడే సంకల్పించారు. బిసి బిడ్డలైన ఈ ఉత్పత్తి మట్టి కులాలకు, తాను ఆధునిక సావిత్రిబాయి కావాలనుకున్నది. పూర్తిగా బిసి సమస్యలు, రిజర్వేషన్ ఫలాలను, అందించటమే లక్ష్యంగా కంకణం కట్టుంది. అది ఎలాంటి కంకణమంటే, ఈ రాష్ట్రంలోనే అనేక బిసి ఉద్యమాలను నడిపిన అనేక బిసి సంస్థలకు, కులాల వారీ సపోర్ట్ తెలంగాణ జాగృతి యునైటెడ్ పూలే ఫ్రంట్ యుపిఎఫ్‌కి అనుబంధంగా 112 కులాలను పోగు చేసి, ఒకే గొడుగు కిందకు తీసుకొని వచ్చింది కవిత. కులాల వారీగా, 112 కులాలతో కులాలవారీగా సమావేశాలను నిర్వహించడం, తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పర్యటించి జిల్లాకొక రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించడం, ప్రతి జిల్లాల్లో నిద్రావస్థలో ఉన్న బిసి ఉద్యమ అస్తిత్వాన్ని తట్టిలేపింది.లోతుగా వారి సమస్యలను విన్నారు. ఇందిరా పార్క్ వేదికగా బిసి మహాధర్నా, బిసి గర్జన లాంటి కార్యక్రమాలు నిర్వహిం చి, యావత్ బిసి సమాజం అంతా కూడా పోరాడితే కవితలా నిత్యం లైవ్‌లో అంశాన్ని ఉంచి పోరాడాలి అనే అంతగా. నాడు ప్రభుత్వం కులగణన చేయడానికి ముందుకు వచ్చింది. తానే స్వయంగా కులగణనలో నమోదు చేసుకొని దానిలో ఉన్న పొరపాట్లను వేలెత్తి ప్రభుత్వానికి తెలియజేసింది. బిసి డెడికేషన్ కమిషన్ వేయాలని అనేకమార్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేసిన డెడికేషన్ కమిషన్‌కి బిసి సంఘా లతో వెళ్లి నివేదిక సమర్పించారు. దాని కాలపరిమితి తీరిపోతే డెడికేషన్ కమిషన్ కాలపరిమితిని పెంచాలని డిమాండ్ చేసింది. బిసి హక్కుల కోసం, వారి రిజర్వేషన్ల సాధన కోసం ప్రభుత్వం ఒక బిల్లు తీసుకొస్తాయంటే ఒక్క బిల్లు కాదు, మూడు బిల్లులు తీసుకురావాలని, రాజకీయపరమైన రిజర్వేషన్స్ ఒకటి అయితే భావితరం బాగుండాలి అంటే విద్యలో, ఉద్యోగాలలో సైతం బిసిలకు అన్యాయం జరగొద్దని మండలిలో గర్జించింది, ఆ మూడు బిల్లులను సాధించింది. ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లోపాలను నిత్యం ప్రశ్నిస్తూ ఉన్న సంఖ్యను తగ్గించి చూపెట్టిన ప్రభుత్వానికి చురకలు అంటించి మళ్లీ కులగణనకు డిమాండ్ చేసింది.పతాక శీర్షికలో కవిత బిసి ఉద్యమ ప్రయాణం నడుస్తుంటే దాన్ని ఇంకో దశకు మార్చటం కోసం రైల్ రోకోకు పిలుపునిచ్చారు. ఈ పిలుపుతో బిసి సమాజం విస్మయానికి లోనయింది. కొన్ని ప్రధాన పార్టీలు ఏంటి ఈమె ధైర్యం అని నోరెళ్ళ పెట్టినాయి అంటే అతిశయోక్తి కాదు. ఒక మహిళగా ఇంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నప్పుడే బిసిల కోసం పుట్టిన ఆధునిక సావిత్రిబాయి అని బిసి సమాజం భావించింది. కుటుంబంలో అభిప్రాయ భేదాలు వచ్చినా పెద్దగా లెక్కచేయకుండా బిసి సమాజమే తన కుటుంబంగా కదిలిందంటే ఆమె ముమ్మాటికీ బిసిల ఆత్మబంధువు కాక ఇంకేమవుతారు. భవిష్యత్ రాజకీయాలను తెలంగాణ రాష్ట్రం లో ప్రభావితం చేయగలిగిన నేర్పరి, విషయ పరిజ్ఞాని, పరిశోధకురాలు, అకుంటిత దీక్షాదక్షురాలు, ధారాళంగా అన్ని భాషల్లో కెసిఆర్‌లా అనర్గళంగా మాట్లాడి ఒప్పించే దిట్ట. ధైర్య శీలి మాస్ లీడర్ కవిత అన్న విషయం గుర్తెరగాలి. కవిత బతుకమ్మను ఎంత పవిత్రంగా ఎత్తుకుంటారో అంతే పవిత్రంగా బిసి ఉద్యమాన్ని ఎత్తుకున్నారు. ఇవ్వాళ బతుకమ్మను విశ్వపీఠాన నిలబెట్టింది. రేపు బిసి హక్కులను అంతేస్థాయిలో నిలబెడుతుంది. తెలంగాణ చారిత్రక ఘట్టాలలో కవిత చేపట్టిన బిసి ఉద్యమం నిలిచిపోతుంది.

# గిరిజన హక్కుల కోసం పోరాడిననేత



రాంచి,శిబూ సోరెన్ ఆదివాసీ నాయకుడిగా, జార్ఖండ్ ముక్తి మోర్చా (ఓఃః) స్థాపకుడిగా చేసిన కృషి రాష్ట్ర రాజకీయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. సామాన్యుల హక్కులు, ఆదివాసీ సమాజ ఉద్ధరణ కోసం అలుపెరగని పోరాటం చేశారు. రాజకీయ నాయకుడిగానే కాక, సామాజిక సంస్కర్తగా ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది.శిబూ సోరెన్ 1944 జనవరి 11న జన్మించారు. జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు- కోసం నడిపిన ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. మూడుసార్లు జార్ఖండ్ ముఖ్యమంత్రిగా (2005లో 10 రోజులు, 2008-2009, 2009-2010) పనిచేశారు. ఆయన దుమ్కా లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఏకంగా ఎనిమిది సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 2004, 2004-2005, 2006లో కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా పనిచేశారు. జెఎంఎ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన శిబు సోరెన్ జనవరి 11, 1944లో జన్మించారు. నెమ్రా గ్రామంలో ఉమ్మడి బీహార్‌లో భాగమైన..ప్రస్తుతం జార్ఖండ్‌లో న్మించారు. ఆయన తండ్రి షోబరన్ సోరెన్. శిబు సోరెన్‌కు 15 ఏళ్ల వయసున్నప్పుడు వడ్డీవ్యాపారులు చేసిన దాడిలో తన తండ్రి షోబరన్ మృతి చెందాడు. ఈ ఘటన శిబు సోరెన్‌పై తీవ్ర ప్రభావం పడింది. హజారిబాగ్‌లోని గోలా హైస్కూల్‌లో శిబు సోరెన్ మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. రూపి సోరెన్‌ను జనవరి 1, 1962లో వివాహమాడారు. వీరికి నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు దుర్గా సోరెన్ 2009లో మృతి చెందారు. కుమార్తె అంజని జెఎంఎం ఒడిశా యూనిట్‌కు నాయకత్వం వహిస్తుంది. ఆయన చిన్న కుమారుడు బసంత్ సోరెన్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక మరో కుమారుడు హేమంత్ సోరెన్ జార్ఖండ్ రాష్ట్రానికి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారు. శిబు సోరెన్ మృతితో గిరిజనుల గొంతు వినిపించే జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన ఓ రాజకీయ శకం ముగిసింది. శిబు 'డిషోమ్ గురు' (దేశ నాయకుడు) గా విస్తృతంగా ప్రసిద్ధి చెందారు. గిరిజనుల హక్కుల కోసం నిరంతరాయంగా పోరాడిన నేతగా ఆయన గుర్తింపు పొందారు. అలాగే ప్రాంతీయ, జాతీయ రాజకీయాల్లో కూడా కీలక పాత్ర పోషించారు.1973లో ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎ కె రారు, బిహారీ మహతోలతో కలిసి శిబుసోరెన్ జార్ఖండ్ ముక్తి మోర్చా జెంఎంఎంను స్థాపించారు. ఆయన నాయకత్వంలో గిరిజన రాష్ట్రం జార్ఖండ్ కోసం జెఎంఎం పార్టీ ప్రధాన శక్తిగా ఎదిగింది. ప్రత్యేక రాష్ట్రం కోసం చోటానాగ్‌పూర్, సంతల్ పరగణ ప్రాంతాలలో ఈ పార్టీ బలమైన మద్దతును కూడగట్టుకుంది. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి..వారి కలను సాకారం చేసుకున్నారు. వీరి ఆధ్వర్యంలో దశాబ్దాల తరబడి సాగించిన ఆందోళనల తర్వాత నవంబర్ 15, 2000 సంవత్సరంలో జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. శిబు రాజకీయ జీవితం 1980లోనే మొదలైంది. 1980లో ఏడవ లోక్‌సభ ఎన్నికల్లో దుమ్కా స్థానం నుంచి ఆయన పోటీ- చేసి గెలిచారు. ఈ స్థానం నుంచే ఆయన పలుమార్లు గెలిచారు. ఆయన 2020లో రాజ్యసభకు ఎంపీగా కూడా పనిచేశారు. అక్టోబర్ 2024లో గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖకు సంబంధించిన కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు.శిబుసోరెన్ మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఎప్పుడూ పూర్తికాలం ఆ బాధ్యతల్లో లేరు. కేవలం కొన్నిరోజులు లేక..కొన్ని నెలలే ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యల్లో ఉన్నారు. మార్చి 2-11 2005, ఆగస్టు 27 (2008) - జనవరి 12 (2009) వరకు, డిసెంబర్ 30 (2009) - మే 31 (2010) వరకు ఆయన సిఎంగా ఉన్నారు. యుపిఎ-1 హయాంలో 2004-2006 మధ్య మూడుసార్లు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖామంత్రిగా పనిచేశారు. ఆయన కేంద్ర మంత్రితవర్గంలో ఉన్న సమయంలో.. చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 1975 చిరుదిహ్ ఊచకోత కేసుకు సంబంధించి సోరెన్‌పై 2004లో అరెస్టు వారెంట్ జారీ చేయబడింది. దీంతో అతను కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్లారు. అయితే ఆయన అరెస్టు అయిన తర్వాత కొంతకాలం కస్టడీలో ఉన్నారు. ఆ తర్వాత బెయిల్ పొందిన తర్వాత తిగిరి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. మార్చి 2008లో ఆయన ఈ కేసులో నిర్దోషిగా విడుదలయ్యారు. 994లో తన మాజీ కార్యదర్శి శశినాథ్ ఝా కిడ్నాప్ మరియు హత్య కేసులో సోరెన్ నవంబర్ 2006లో దోషిగా నిర్ధారించబడ్డారు. 1993లో పి.వి నరసింహారావు ప్రభుత్వంపై జరిగిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా రాజకీయ పలుకుబడి కలిగిన ఝా నోరు మూయించేందుకు అతనిని శిబు సోరెన్ హత్య చేశారని సిబిఐ ఆరోపించింది. అయితే సోరెన్ ఈ కేసులో నిర్దోషిగా విడుదలయ్యాడు. ఏప్రిల్ 2018లో సుప్రీంకోర్టు శిబుసోరెన్‌ను నిర్దోషిగా తేల్చింది.జూన్ 2007లో సోరెన్‌ను జైలుకు తీసుకెళుతున్నప్పుడు దేవఘర్ సమీపంలో ఆయన కాన్వాయ్‌పై పేలుడు పదార్థాలు విసిరి హత్యాయత్నం జరిగింది. అయితే ఈ దాడిలో ఆయన తప్పించుకున్నారు. ఆయన రాజకీయ జీవితంలో అస్థిరతలు ఉన్నప్పటికీ జార్ఖండ్‌లో ఆయన ప్రభావం చెక్కుచెదరకుండా ఉంది. ఆయన ఏప్రిల్ 2025వరకు 38 సంవత్సరాలు జెఎంఎం అధ్యక్షుడిగా నాయకత్వం వహించారు. ఆయన కుమారుడు హేమంత్‌సోరెన్ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఏప్రిల్‌లో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. శిబుసోరెన్ దశాబ్దాల రాజకీయ జీవితం.. జార్ఖండ్ రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలుపుతుంది. గిరిజనుల గుర్తింపు, గౌరవం, స్వయంపాలన కోసం చేసిన ఆయన పోరాటం.. ముందు తరాలకు శాశ్వత వారసత్వంగా నిలిచిపోతుంది.

# సుప్రీం ఘాటు హెచ్చరిక

న్యూఢిల్లీ,సుప్రీంకోర్టు సోమవారం రాహుల్ గాంధీకి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. 2020 గల్వాన్ వ్యాలీలో జరిగిన ఘర్షణల గురించి ఆయన చేసిన కామెంట్స్ కారణంగా ఈ హెచ్చరిక చేసింది. రాహుల్, తన భారత్ జోడో యాత్రలో చైనా 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని, ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని సరెండర్ చేశారని పేర్కొన్నారు. ఆ మాటలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌ల బెంచ్ రాహుల్‌ని సీరియస్‌గా ప్రశ్నించింది. 2,000 చదరపు కిలోమీటర్ల భూమిని చైనా తీసుకుందని మీరు ఎలా తెలుసుకున్నారని ప్రశ్నించింది? మీరు నిజమైన భారతీయులైతే అలా మాట్లాడరు కాదా అని జస్టిస్ దత్తా అడిగారు. మీరు అక్కడ ఉన్నారని, మీ దగ్గర ఏమైనా నమ్మదగిన ఆధారాలు ఉన్నాయా అని అడిగింది. రాహుల్ తరపున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ వాదించారు. రాహుల్ అలాంటి మాటలు చెప్పకపోతే, ఆయన ప్రతిపక్ష నాయకుడిగా ఎలా ఉంటారని సింఘ్వీ అన్నారు. దీనికి జస్టిస్ దత్తా మరి ఇలాంటివి పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అయినా, ఈ కేసును కొట్టివేయాలన్న రాహుల్ విజ్ఞప్తిపై కోర్టు నోటీసు జారీ చేసింది. ఈ కేసు కొనసాగనుందని చెప్పింది. సింఘ్వీ, ఈ కేసులో కొన్ని తప్పులు జరిగాయని చెప్పారు. పోలీసులు రాహుల్‌కి ముందస్తు విచారణ అవకాశం ఇవ్వకుండానే కేసు నమోదు చేశారని వాదించారు. గతంలో, మే నెలలో అలహాబాద్ హైకోర్టు కూడా రాహుల్ పిటిషన్‌ను తిరస్కరించింది. లక్నోలో ప్రత్యేక కోర్టు రాహుల్‌కు ఫిబ్రవరిలో సమన్స్ జారీ చేసి, ఆయనపై విచారణకు ఆదేశించింది. హైకోర్టు జడ్జి సుభాష్.. స్వేచ్ఛగా మాట్లాడే హక్కు అంటే సైన్యాన్ని అవమానించేలా మాట్లాడే హక్కు కాదని పేర్కొన్నారు. ఈ కేసు మొదట 2022 డిసెంబర్‌లో ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో బయటకొచ్చింది. రాహుల్ గాంధీ సైన్యం గురించి అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు. రాహుల్ మాత్రం ఈ ఆరోపణలు రాజకీయంగా ప్రేరేపితమని చెప్పారు. రాహుల్ ఈ విషయాన్ని పలుమార్లు పునరావృతం చేశారు. 2023 జనవరిలో జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో కూడా, చైనా మన భూమిని ఆక్రమించిందన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని ఖండించింది.

## రఘురామపై కానిస్టేబుల్ కేసు..

న్యూఢిల్లీ,ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజుపై పెట్టిన కేసును ఇక కొనసాగించలేనని సుప్రీంకోర్టుకు ఫిర్యాదుదారు కానిస్టేబుల్ ఫరూక్‌భాష తెలిపారు. 2022 జూన్‌లో రఘురామ, ఆయన కొడుకు భరత్‌పై ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఫరూక్‌భాష కేసు పెట్టారు. రఘురామ ఇంటి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి రఘురామ, ఆయన భద్రతా సిబ్బంది ఫిర్యాదు చేశారు. డ్యూటీలో ఉన్న తనపై దాడికి పాల్పడ్డారని రఘురామ, ఆయన కొడుకు భరత్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై అదే పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఫరూక్‌భాష ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ ఫరూక్‌భాష ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీసులు తమ ఫిర్యాదును పట్టించుకోకుండా... తమపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని హైకోర్టులో సవాలు చేశారు రఘురామ. హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంకోర్టును రఘురామ ఆశ్రయించారు. రఘురామ పిటిషన్‌పై జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం విచారణ జరిపింది. ఎంపీగా వై క్యాటగిరిలో సీఆర్‌పీఎఫ్ భద్రత ఉన్న సమయంలో అనేక ఘటనలు జరిగాయని రఘురామ తరపు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకుని పోలీసు స్టేషన్‌లో అప్పజెప్పి... ఫిర్యాదు చేస్తే పోలీసులు తమపైనే ఎదురు కేసు పెట్టారని రఘురామ న్యాయవాది వివరించారు. వరుస ఘటనలకు సంబంధించిన వివరాలు కోర్టుకు అందించాలని రఘురామ న్యాయవాదిని ఆదేశించింది సుప్రీంకోర్టు ధర్మాసనం. అదే సమయంలో ఫిర్యాదు దారు కానిస్టేబుల్ ఫరూక్‌భాష తరపు న్యాయవాది జోక్యం చేసుకున్నారు. ఇకపై ఈ కేసును కొనసాగించేందుకు సిద్దంగా ఆయన లేరని తనకు సమాచారం పంపినట్లు- ఫరూక్‌భాష న్యాయవాది తెలిపారు. అందుకు అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణను రెండు వారాలు సుప్రీంకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది.

## కుదరంటున్న బీజేపీ !

హైదరాబాద్,తెలుగుదేశం పార్టీతో బీజేపీ పొత్తుకు నో చెబుతోంది. ఎక్కడా ఏమిటీ అంటేనే మ్యాటర్ పొలిటికల్ గా వేరే అని అర్థం చేసుకోవాలి. ఏపీలో చూస్తే టీడీపీ పెద్దన్నగా ఉంది. బీజేపీ జనసేన వచ్చి చేరాయి. మూడు పార్టీలు కలసి కూటమి కట్టాయి. దాంతో బ్రహ్మాండమైన మెజారిటీ వచ్చింది. దివ్యంగా ప్రభుత్వం ఏర్పాడింది. కలసి ఉంటే కలదు సుఖం అనుకుంటూ ముందుకు సాగుతున్నాయి మిత్రపక్షాలు. కానీ తెలంగాణాలో సీన్ రివర్స్ గా ఉంది.

తెలంగాణాలో మాత్రం ఎందుకో :

తెలంగాణాలో బీజేపీ ఇపుడు రాజకీయంగా అవకాశాలు పెంచుకోవాలని చూస్తోంది. ఒక వైపు అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ పార్టీకి చరిష్మాటిక్ లీడర్ రేవంత్ రెడ్డి సీఎం గా ఉన్నారు ఇక బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉంది పదేళ్ళ పాటు తెలంగాణాను ఏలిన పార్టీగా బీఆర్ఎస్ ఉంది. పైగా కేసీఆర్ ఉద్యమకారుడిగా ఉన్నారు. తెలంగాణ మలి విడత పోరాటాన్ని విజయం వైపుగా నడిపిన క్రెడిట్ ని ఆయన ఖాతాలో వేసుకున్నారు అలా బీఅర్ఎస్ కి ఇంధనం ఇమేజ్ అన్నీ కేసీఆర్ అని వేరేగా చెప్పాల్సింది లేదు. ఈ మధ్యలో బీజేపీ ఉంది. బీజేపీ జాతీయ స్థాయిలో బలంగా ఉన్నా తెలంగాణాలో మాత్రం ఎందుకో ఎత్తిగిల్లలేకపోతోంది. పార్టీలో ఎక్కువ మంది నాయకులు ఉండడం కూడా బీజేపీకి ఇబ్బందిగానే ఉన్నట్లుంది దాంతో అందరినీ కలుపుకుని పోయే విధంగా బీజేపీ దృఢమైన నాయకత్వంతోనే ముందుకు సాగాల్సి ఉంది.

పొత్తుకు బీజేపీ నో :

ఇక బీజేపీకి పట్టణ ప్రాంతాలలో బలం ఉంది. రూరల్ బేస్ లో కమలానికి ఆదరణ తక్కువ అన్నది కూడా ఒక విశ్లేషణ గా ఉంది. టీడీపీ తెలంగాణాలో ఈ రోజుకీ కొన్ని ప్యాకెట్స్ లో కొంత ప్రభావం చూపించే స్థితిలో ఉంది. అలా బీజేపీ టీడీపీ జనసేనలకు కలుపుకుని ఎన్డీయే కూటమిగా ముందుకు సాగితే అధికారం దక్కుతుంది అన్న లెక్కలు ఉన్నాయి. అయితే ఈ రకమైన రాజకీయ సమీకరణ వల్ల తెలంగాణా వాదం ముందుకు వచ్చి అసలుకే ఎసరు వస్తుందని కూడా ఆలోచిస్తున్నారు. దాంతో టీడీపీతో పొత్తులు నో అని బీజేపీ చెబుతోంది.

ఒంటరిగానేనని క్లారిటీ :

తెలంగాణాలో టీడీపీతో కానీ జనసేనతో కానీ పొత్తులకు ఆస్కారం లేదని తెలంగాణా బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టంగా చెప్పారు. ఏపీలో రాజకీయం వేరు అక్కడ పరిస్థితులు వేరు, కానీ తెలంగాణా రాజకీయం వేరు పరిస్థితులు వేరు అని ఆయన అంటున్నారు. తెలంగాణాలో బీజేపీ ఈ కారణంగానే పొత్తుల వైపు చూడటం లేదని సొంతంగా పోటీకి సిద్దపడుతోందని ఆయన వివరిస్తున్నారు.

ఏపీకి మాత్రమే ఎన్డీయే :

దీంతో ఏపీకి మాత్రమే ఎన్డీయే పరిమితం అని పక్కా క్లారిటీని అయితే బీజేపీ ఇచ్చేసింది. నిజానికి డబుల్ ఇంజన్ సర్కార్ అని బీజేపీ నినదిస్తుంది.

# హస్తిన బాట పట్టిన తెలంగాణ రాజకీయం



హైదరాబాద్,తెలంగాణ రాజకీయనేతలంతా ఢీల్లీ బాట పట్టారు. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రంపై ఒత్తిడి పెంచే దిశగా జంతర్ మంతర్ వద్ద ధర్నాకు సమాయత్తమై ఏకంగా ప్రత్యేక రైలులో హస్తిన వెడితే... ప్రతిపక్ష బీఆర్ఎస్ కీలక నేతలు కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు హస్తిన బయలుదేరారు. మొత్తం మీద ఢిల్లీ వేదికగా తెలంగాణ రాజకీయం రసకందాయంలో పడిందని చెప్పాల్సి ఉంటుంది. ఎవరు ఔనన్నా కాదన్నా.. కాళేశ్వరం కమిషన్ నివేదిక అంశం తెరమీదకు రావడానికి ముందు వరకూ కూడా తెలంగాణ రాజకీయం మొత్తం బీసీ రిజర్వేషన్ల చుట్టూ తిరిగింది. కాళేశ్వరం కమిషన్ నివేదిక కాంగ్రెస్ లో జోష్ నింపగా, బీఆర్ఎస్ ను బెంబేలెత్తిస్తోంది. అయితే కేవలం కాళేశ్వరం కారణంగా బీసీ రిజర్వేషన్ల అంశం మరుగున పడేందుకు కాంగ్రెస్ ఏ మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. కాళేశ్వరం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని డైవర్ట్ కాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది. కాళేశ్వరం కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టి సభ్యుల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రకటించడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంతిని బీఆర్ఎస్ కోర్టులోకి నెట్టేశారు.

ఇప్పుడు అసెంబ్లీలో కాళేశ్వరం నివేదికపై చర్చలో పాల్గొనేదీ, లేనిదీ నిర్ణయించుకోవలసింది బీఆర్ఎస్, కేసీఆర్ లే. దీంతో కాంగ్రెస్ ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమం మేరకు హస్తినపై దృష్టి పెట్టింది. బీసీ రిజర్వేషన్ల విషయంలో అధికారంలో ఉన్న మోడీ సర్కార్ పై ఒత్తిడి పెంచేందుకు బుధవారం (ఆగస్టు 6) హస్తినలో జంతర్ మంతర్ వద్ద జరగనున్న భారీ ర్యాలీలో రాష్ట్ర కాంగ్రెస్ కీలక నేతలంతా పాల్గొంటున్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రయోగించిన బీసీ రిజర్వేషన్ అస్త్రం ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలకూ ఒక ఆయుధంగా మారింది.రిజర్వేషన్ల కోసం పోరాడిని పార్టీగా పేరు తెచ్చుకునేందుకు బీజేపీయేతర పార్టీలన్నీ పోటీలు పడుతున్నాయి. ఇక బీఆర్ఎస్ తో విభేదించి సొంత మార్గంలో నడుస్తున్న కల్వకుంట్ల కవిత సైతం బీసీ పోరులో నేనున్నానంటూ హడావుడి చేస్తున్నారు. ఆఖరికి కేంద్రంలో అధికార కూటమికి నాయకత్వం వహిస్తున్న బీజేపీ సైతం హస్తిన వేదికగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తీరుకు, వైఖరికి నిరసనగా హస్తినలో గత శనివారం నిరసన కార్యక్రమం చేపట్టింది.దిల్లీ జంతర్మంతర్ వద్ద ఈనెల 6న బీసీ వర్గాలతో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టేందుకు కాంగ్రెస్ కార్యాచరణ రూపొందించింది. ఈ ధర్నాకు తెలంగాణలోని ప్రతి రాష్ట్రం నుంచీ కనీసం పాతిక మందికి తక్కువకాకుండా సమీకరించి సోమవారం (ఆగస్టు 4) ప్రత్యేక రైల్లో దిల్లీ బాట పట్టింది రాష్ట్ర కాంగ్రెస్. జంతర్ మంతర్ ధర్నా కంటే ముందు పార్లముంటులో బీసీ రిజర్వేషన్లపై చర్చకు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్ట ముందు ఈ నెల 5న పార్లమెంటులో బీసీ బిల్లుపై చర్చించేందుకు వాయిదా తీర్మానాన్ని ప్రవేశ పెట్టే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తోంది. చివరగా ఆగస్ట్ 7న అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆయోదించిన బీసీ బిల్లును ఆమోదించాల్సిందిగా రాష్ట్రపతికి వినతిపత్రాన్ని సమర్పించనుంది. మొత్తంమీద బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రస్తుతం అన్ని రాజకీయపార్టీలను పరుగులు పెట్టిస్తున్నది. త్వరలో రానున్న స్థానిక ఎన్నికలు ఈ రిజర్వేషన్లతో ముడివడి ఉండడంతో పార్టీలకు ఆ బాట పట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది.

# ధర్మస్థలిలో నాలుగు మృతదేహాల లభ్యం? వీడనున్న మిస్టరీ!

బెంగళూర్ :కర్ణాటక ధర్మస్థల లో సామూహిక ఖననాల మిస్టరీ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగా పోలీసులు సిట్ ఆధ్వర్యంలో తవ్వకాలు కొనసాగిస్తున్న క్రమంలో సోమవారం 11వ పాయింట్ వద్ద ఎత్తైన ప్రదేశంలో నాలుగు మృతదేహాల అవశేషాలు వెలికితీసినట్లుగా సమాచారం. అధికారులు ఈ కేసులో కీలకంగా ఉన్న పారిశుధ్య కార్మికుడు చెప్పిన..చూపించిన ప్రాంతాలను మొత్తం 13పాయింట్లు గుర్తించగా..8,9,10 పాయింట్లలో 8ఫీట్ల వరకు తవ్వకాలు చేసినా ఏం లభించలేదు. దీంతో 11,12,13వ పాయింట్ల వద్ద తవ్వకాలు చేపట్టగా..11వ పాయింట్ లో నాలుగు మృతదేహాల అవశేషాలు బయటపడినట్లుగా తెలుస్తుంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి సమాచారం వెలువడలేదు. ఈ మూడు పాయింట్లు హైవేను ఆనుకుని ఉండడం గమనార్హం. సిబ్బంది భారీగా ఉప్పు బస్తాలు ఆ ప్రాంతానికి తరలించారు. దీంతో ఈ ప్రాంతాల్లో మరిన్ని మృతదేహాలు వెలుగు చూడవచ్చన్న అంచనాలతోనే ఉప్పు బస్తాలు ఆ ప్రాంతానికి తరలించారని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి అయిన మాజీ పారిశుధ్య కార్మికుడిని వెంటపెట్టుకుని అధికారులు తవ్వకాలు జరుపుతున్నారు. 1998 నుంచి 2014 మధ్య ధర్మస్థలిలో వందలాది మృతదేహాల ఖననం జరిగిందని, బలవంతంగా తనతో ఆ మృతదేహాలను పూడ్చి పెట్టించారని ఓ వ్యక్తి ముందుకు రావడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో అతను చూపించిన చోట్లలో అధికారులు తవ్వకాలు జరుపుతున్నారు.

'జీపీఆర్' టెక్నాలజీ వినియోగానికి డిమాండ్

అయితే పదేళ్ల కాలంలో ఈ ప్రాంతంలో చాలా మార్పులు సంభవించడం.. భారీ వర్షం, మట్టి కొట్టుకుపోవడం లాంటి పరిణామాలతో పారిశుధ్య కార్మికుడు చెప్పిన మృతదేహాల ఖననం ప్రాంతాలను గుర్తించడం కష్టంగా మారుతుంది. ఈ కేసులో బాధితులు సుజాత భట్ తరఫున ఆమె న్యాయవాది మంజునాథ్



'జీపీఆర్' టెక్నాలజీ వాడే అవకాశాన్ని పరిశీలించమని సిట్‌ను కోరుతుండటం ఆసక్తికరంగా మారింది. ఈ తరహా తవ్వకాల్లో ఎక్కువగా ఫోరెన్సిక్ నిపుణులు, ఆర్కియాలజీవాళ్లు ఈ సాంకేతికతను వినియోగిస్తుంటారు. జీపీఆర్ టెక్నాలజీ అయితే బాంబ్ డిటెక్టర్ తరహాలో ఉండటం ద్వారా ఎలక్ట్రోమాగ్నటిక్ తరంగాలను భూమిలోకి పంపి భూమి పొరల్లోని ఎముకలు, కేవిటీస్, తదితర మార్పులను గుర్తించి నిర్థిష్టంగా తవ్వకాలు జరిపేందుకు ఉపకరిస్తుందన్న వాదన వినిపిస్తుంది. ఇందుకు ప్రభుత్వం ఎంతమేరకు అంగీకరిస్తుందన్నది చూడాల్సి ఉంది.త్రవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల్లో యాంటీ నక్సల్ ఫోర్స్ ను కాపలా విధుల్లో మోహరించారు. ఇప్పటికైతై నేత్రావతి నది ఒడ్డున ఉన్న ఆరో పాయింట్‌లో మనిషి ఎముకలు బయటపడ్డాయి. కానీ పుర్రె మాత్రం లభించలేదు. ఫోరెన్సిక్ పరీక్షలు ద్వారా వయస్సు, లింగం, మరణ కారణం నిర్ధారణ కావాల్సి ఉంది. అదే సమయంలో.. కొన్ని చోట్ల పాన్ కార్డు, ఏటీఎం కార్డు లభించాయి. పాన్ కార్డు నెలమంగళ ప్రాంతానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించారు. అతను జాండిస్‌తో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. అయితే.. ఏటీఎం కార్డు వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# రేవంత్ రాజకీయం: ఆవేశమే లేదు అంతా పక్కా ప్లానే !

హైదరాబాద్,రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పడిన బాధలు, చేసిన ఆవేశపూరిత ప్రసంగాలు, ఇప్పుడు బహిరంగసభల్లో ఇస్తున్న ప్రసంగాలు చూస్తే ఆయన తొందరపడతారేమో అని కొంత మంది కంగారు పడుతూ ఉంటారు. కానీ రేవంత్ రెడ్డి రాజకీయాన్ని రాజకీయంగా.. పాలనను పాలనగా చేస్తున్నారు. అదే సమయంలో ఆయన చేయాలనుకున్నది చేస్తున్నారు. పద్దతిగా చేస్తున్నారు. కక్ష సాధింపులన్న ప్రచారం రాకుండా చేస్తున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులను చావుదెబ్బ కొట్టడానికి ఏం చేయాలో అది చేస్తున్నారు. కాళేశ్వరం రిపోర్టు విషయంలో రేవంత్ స్లో అండ్ స్టడీ వ్యూహం బీఆర్ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రజల్లో చర్చకు కాళేశ్వరం రిపోర్టు

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో అడ్డగోలుగా దోచుకున్నారన్న అభిప్రాయాన్ని ప్రజల్లోకి బలంగా నాటడంలో రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే సక్సెస్ అయ్యారు. ఇపుడు దాన్ని నిరూపించాల్సి ఉంది. నేరుగా కేసులు పెట్టి అరెస్టులు చేస్తే.. అది బ్యాక్ ఫైర్ అవుతుంది. అందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ కు ప్రభుత్వం తరపున సమాచారం ఇచ్చారు. సహజంగానే కేసీఆర్ అన్ని నిబంధనలు ఉల్లంఘించి అంతా తాను అనుకున్నట్లే చేశారు కాబట్టి అదే విషయాన్ని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పారు. బాధ్యులెవరో చెప్పారు. ఇక రేవంత్ ఆట ప్రారంభించారు.

అసెంబ్లీలో చర్చ – రేవంత్ మాస్టర్ స్ట్రోక్

కాళేశ్వరం రిపోర్టుపై ప్రాథమికమైన అంశాలను ప్రజల ముందు ఉంచారు. పూర్తి రిపోర్టును ప్రజల ముందు ఉంచుతామని అసెంబ్లీలో అందరి అభిప్రాయాలు వింటామన్నారు. అంటే అసెంబ్లీలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన 665 పేజీల నివేదికపై సమగ్రమైన చర్చ జరుగుతుంది. అందులో ఉన్న వన్నీ బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకవతకలే. ఎక్కడెక్కడ కేసీఆర్ ను



ఇరికించవచ్చో.. ఎక్కడెక్కడ హరీష్ ను రోడ్డున పడేయవచ్చో చూసుకుని మరీ క్రిమినల్ చర్యలకు ఆదేశిస్తారు. అప్పటికే అసలు విషయాలు అసెంబ్లీ ద్వారా ప్రజలకు చేరిపోతాయి కాబట్టి.. కక్ష సాధింపులన్న ఆలోచనలు.. ఆరోపణలు రావు.

కేసీఆర్ కూడా ఊహించని వ్యూహాలు

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ రిటైర్డ్ చాణక్య అయిపోయారు. ఆయన పార్టీని గెలిపించలేకపోయారు. పార్టీ పతనాన్ని అడ్డుకోలేకపోతున్నారు. ఆయనను కూడా కార్నర్ చేసే విధంగా రేవంత్ రెడ్డి కొత్త చాణక్యుడిగా అవతరించారు. రేవంత్ రెడ్డి ఎలాంటి వ్యూహాలు పన్నుతారో అర్థం చేసుకోలేకపోతున్నారు. ఆయనకు కౌంటర్ ఇవ్వడానికి ఏం చేయాలో కూడా తెలుసుకోలేకపోతున్నారు. ఫలితంగా కేటీఆర్ లోని అసహనం.. పరిధులు దాటుతోంది. దాన్ని కూడా రేవంత్ తనకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. రేవంత్ ఆగి ఆగి.. కొట్టబోయే దెబ్బలను బీఆర్ఎస్ ఎలా కాచుకుంటుందన్నదే ఇప్పుడు అత్యంత కీలకం.

# బీఆర్ఎస్‌పై బీజేపీ పంజా –వలసల సునామీ !




హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి ఓటు బ్యాంకును ఇప్పటికే చాలా వరకూ కైవసం చేసుకున్న బీజేపీ ఇప్పుడు ఆ పార్టీ నేతల్ని కూడా ఆకర్షిస్తోంది. ముందుగా తమ పార్టీ కాస్త బలహీనంగా ఉన్న దక్షిణ తెలంగాణపై దృష్టి పెట్టింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ నేతల్ని పార్టీలోకి చేర్పించేందుకు మిషన్ ప్రారంభించింది. నాగర్ కర్నూలు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు గువ్వల బాలరాజు రాజీనామా చేసి బీజేపీలో చేరాలనుకోవడం ప్రారంభమే.

పాలమూరు జిల్లా బీఆర్ఎస్ కీలక నేతలంతా బీజేపీలోకే ?

ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ గత ఎన్నికల్లో బోల్తా పడింది. ఆ తర్వాత పార్టీ వ్యవహారాలకు అందరూ దూరమవుతూ వస్తున్నారు. యాక్టివ్ గా ఉన్న వారు హైదరాబాద్‌లోనే తన చురుకుదనం చూపిస్తున్నారు కానీ క్షేత్ర స్థాయిలో అసలు పార్టీని పట్టించుకోవడం లేదు. తమ పార్టీకి రాజకీయ భవిష్యత్ ఉందో లేదో వారికి అర్థం కావడం లేదు. అందుకే ప్రత్యామ్నాయాలు చూసుకుందామా అన్న ఆలోచనలో ఉన్నారు. వారి ఆలోచనలను బీజేపీ నాయకత్వం పసిగట్టింది. భవిష్యత్ బీజేపీదేనని.. భరోసా ఇచ్చిపార్టీలోకి రావాలని సంకేతాలు పంపుతోంది.

బీఆర్ఎస్ పుట్టి ముంచనున్న విలీన ప్రచారం

భారత రాష్ట్ర సమితి ఇవాళ కాకపోతే రేపైనా బీజేపీలో విలీనం కాక తప్పదన్న ప్రచారం జరుగుతోంది. ఆ ప్రచారాన్ని ఎవరూ ఖండించడం లేదు. స్వయంగా కల్వకుంట్ల కవిత ఈ విషయాన్ని చెప్పారు. తర్వాత అదే అంశంపై తనతో చర్చించారని.. సీఎం రమేష్ కూడా చెప్పారు. అయితే బీఆర్ఎస్ విలీనాన్ని బీజేపీ పెద్దలు అంగీకరించలేదని అంటున్నారు. అందుకే విలీనం ఆగిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే బీజేపీని బీఆర్ఎస్ ఏమీ అనడం లేదు. తమ ఓటు బ్యాంకును క్రమంగా మింగేస్తున్నా.. నోరెత్తలేకపోతున్నారు. అంటే..బీజేపీ ఎప్పటికైనా దయ తలుస్తుందేమో అన్న ఆలోచనతో ఉన్నట్లుగా అర్థం చేసుకోవచ్చు. అయితే వీరికి ఉన్నంత ఓపిక ఇతర నేతలకు ఉండకపోవచ్చు. విలీనం వరకూ ఎందుకు వేచి చూడాలని వారు అనుకునే ప్రమాదం కనిపిస్తోంది.

ముందు ముందు రాష్ట్ర వ్యాప్త చేరికలు

బీఆర్ఎస్ నేతలు.. కాంగ్రెస్ పార్టీలో కన్నా బీజేపీలో చేరేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా బీజేపీనే ఉందని వారు గట్టిగా నమ్ముతున్నారు. త్వరలోనే బీఆర్ఎస్ఎల్పీ .. ..బీజేపీలో విలీనం అవుతుందని.. తీన్మార్ మల్లన్న జోస్యం చెప్పారు. పరిస్థితులు చూస్తూంటే.. దాన్ని తోసి పుచ్చలేమని రాజకీయవర్గాలు అంటున్నాయి. చుట్టుముడుతున్న కేసులు, విచారణలను ఎదుర్కోవడం బీఆర్ఎస్‌కు అంత తేలిక కాదన్న వినిపిస్తోంది. అదే సమయంలో.. కవిత సమస్య ఉండనే ఉంది. ఇప్పటికే తలసాని లాంటి వాళ్లు సైలెంట్ అయ్యారు. ముందు ముందు రోజుకే బ్రేకింగ్ న్యూస్ రాజీనామాల విషయంలో వచ్చినా ఆశ్చర్యం ఉండదని ఇప్పటికే అందరూ ఫిక్సయిపోతున్నారు.

# కవిత బిసి రిజర్వేషన్ల ధర్నా ఓ జోక్



నల్లగొండ,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎవరో తనకు తెలియదు అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కవిత బీసీ ధర్నా జోక్ అని ఎద్దేవా చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంతో కొట్లాడుతాం అని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం చేస్తా అని కవిత తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. మినిస్టర్ క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. 'క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో మొదటి ఏడాది నేను బాధపడ్డాను. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే ఆనందంగా ఉంది. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమానమే. నల్లగొండ జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్ట్ లను ఏడాదిలో పూర్తి చేస్తాం' అని మంత్రి చెప్పారు.కేబినెట్‌లో జరగబోయే చర్చపై నేను ముందుగా మాట్లాడను. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ నిందితులు జైలుకు వెళ్తారు. నా ఫోన్ ట్యాప్ కాలేదు. ఎపి తలపెట్టిన బనకచర్ల కట్టనివ్వం. కాళేశ్వరం నివేదికపై కేబినెట్‌లో సమగ్రంగా చర్చిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని అందరికీ తెలుసు, ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్నాం. కవిత ఎవరో నాకు తెలియదు. కవిత బీసీ ధర్నా జోక్. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంతో కొట్లాడుతాం. ఆర్డినెన్సును సాధిస్తాం. నారా లోకేష్‌కు రాజకీయ అవగాహన లేదు. భనకచర్లపై అవసరమైతే కేంద్రంపై కొట్లాడుతాం. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకుంటాం' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేడు నల్లగొండ జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. మినిస్టర్ క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశారు. ఆపై యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను, భూమి పూజకు సంబంధించిన వివరాలను సీఎంకు మంత్రి వివరించారు. స్కూల్ నిర్మాణ పనులకు భూమి పూజ, క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కందూరు జైవీర్ రెడ్డి హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డికి ఫోన్ చేయగా.. స్పీకర్ ఆన్ చేసి మాట్లాడారు. మీరు మరలా సీఎం కావాలని ప్రత్యేక పూజలు చేశా అని సీఎంకు మంత్రి తెలిపారు. అందుకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఆపై మిగతా ఎమ్మెల్యేలతో సీఎం మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నల్గొండలో 22 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రే–టె–డ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నిర్మిస్తున్నారు. తెలంగాణ విద్యా రంగంలో యంగ్ ఇండియా ఇంటిగ్రే–టె–డ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా విప్లవాత్మక మార్పు ప్రారంభం కానుంది. పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని, తెలంగాణ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ–పడాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు– మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఇక్కడ ఉంటాయని చెప్పారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే చారిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

# కాళేశ్వరం అధికారులూ బోనెక్కాల్సిందే !

హైదరాబాద్,కాళేశ్వరంలో జరిగిన అవకతవకల విషయంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు తప్పులు ఎవరు చేశారు.. బాధ్యత ఎవరు వహించాలన్నది కూడా స్పష్టంగా పేర్లతో సహా సూచించింది. ఇందులో రాజకీయ నిర్ణయాల పరంగా కేసీఆర్, హరీష్, ఈటల రాజేందర్ లను పేర్కొన్నారు. అదే సమయంలో వారి నిర్ణయాలను నిబంధనల గురించి ఆలోచించకుండా పాటించిన అధికారులూ కాళేశ్వరంలో నిండా మునిగిపోయారు. అలాంటి వారిలో స్మితా సబర్వాల్ కూడా ఉన్నారు.

బోనెక్కబోతున్న "ఎస్ బాస్" అధికారులు

కాళేశ్వరం నిర్మాణంలో నేరుగా పాలు పంచుకున్న.. ముఖ్యంగా నిర్ణయాత్మక బాధ్యత ఉన్న అధికారులందర్నీ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ బాధ్యులను చేసింది. ఇందులో నాటి నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషితో పాటు.. కేసీఆర్ సీఎంగా ఉన్నంత కాలం సీఎంవోలో నీటి పారుదల శాఖ బాధ్యతలు చూసుకున్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ కూడా ఉన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసిన ఇతర ఇంజినీర్ల పేర్లనూ జస్టిస్ ఘోష్ ప్రస్తావించారు. వీరిలో ముగ్గురు ఇప్పటికే అక్రమాస్తులు కూడబెట్టి.. జైళ్లలో ఉన్నారు. మిగతా వారి సంగతి చూడనున్నారు.

స్మితా సబర్వాలే కీలకం !

తెలంగాణ ఏర్పడక ముందు ఉమ్మడి మెదక్ జిల్లాకు కలెక్టర్‌గా ఉన్న స్మితా సబర్వాల్.. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ అభిమానం సంపాదించుకున్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రకటన సమయంలో ఆనందభాష్పాలు రాల్చి ఆమె మీడియాలో హైలెట్ అయ్యారు. కేసీఆర్ దృష్టిని ఆకర్షించారు. ఫలితంగా ఆమెకు నేరుగా సీఎంవోలో చేరిపోయారు. సీఎంవోలో నీటి పారుదల శాఖ మొత్తం ఆమె కనుసన్నల్లో ఉండేది. ఎంతగా అంటే.. హెలికాప్టర్‌లో కాళేశ్వరం పనులను పరిశీలించడానికి వెళ్లేవారు. సాధారణంగా అత్యవసరం అయితే చీఫ్ సెక్రటరీ మాత్రమే హెలికాప్టర్ వాడతారు. కానీ స్మితా సబర్వాల్ కు మాత్రం ఎప్పుడు కావాలంటే అప్పుడు హెలికాప్టర్ రెడీగా ఉండేది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఆమెను పిలిచి ప్రశ్నించింది. అయితే దేనికీ సమాధానాలు సరిగ్గా చెప్పలేదని.. తాను మర్చిపోయానని చెప్పినట్లుగా ప్రచారం జరిగింది.

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలు

ప్రభుత్వ సర్వీసులో ఉండి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు స్మితా సబర్వాల్. ఆమెకు టూరిజం శాఖ లాంటి ప్రాధాన్య శాఖ బాధ్యతలు ఇచ్చినాఆమె ప్రతిపాదనలో మిస్ వరల్డ్ లాంటి పోటీల



నిర్వహణకు అంగీకరించినా కంచ గచ్చిబౌలి విషయంలో ఫేక్ వీడియోలను సర్క్యులేట్ చేశారు. దీంతో ఆమెపై కేసు కూడా నమోదు అయింది. తర్వాత ప్రభుత్వం ఆమెను ఉన్న పళంగా అప్రాధాన్య శాఖకు పంపించారు. తాను ఐఏఎస్‌ను అన్న సంగతి మర్చిపోయి తాను షేర్ చేసిన ఫోటోను వందల మంది షేర్ చేశారని.. వారిపై కేసు పెడతారా అని కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆమె పొలిటికల్ గా వ్యవహరిస్తున్నట్లుగా నిర్ధారించుకుని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

దొరికింది కదా అని దోచుకున్న ఇంజినీర్లు

స్మితా సబర్వాల్ నేరుగా ఆదేశాలు ఇస్తూండటం.. నిబంధనల గురించి పట్టించుకోవద్దని.. చెప్పింది చేయమని ఇంజినీర్లను హెచ్చరించడంతో వారంతా తమ పని తాము చేసుకుపోయారు. అదే సమయంలో కాంట్రాక్టర్లు తమ అవసరాలను తీర్చడంతో అసలు పట్టించుకోలేదు. ఫలితంగా ఇప్పుడు వారంతా అక్రమాల కేసుల్లో ఇరుక్కుపోయారు. సంపాదించుకున్నదంతా ఏసీబీ పట్టుకుంది. రేపు ఈడీ రంగంలోకి వస్తుంది. మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టులో ముందూ వెనుకా ఆలోచించకుండా.. రూల్స్ పట్టించుకోకుండా ఎస్ బాస్ అన్నవారికి గడ్డు పరిస్థితులు రానున్నాయి.

## ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

పార్వతీపురం, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించి, ఓవర్ స్పీడ్, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాలు వందలాది కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. తాజాగా పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు విద్యార్థులు ప్రయాణిస్తున్న స్కూటీని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు గిరిజన విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com